అకౌంటెంట్ కావలెను. యూత్స్ స్వచ్ఛంద సేవా సంస్థకు అకౌంటెంట్ మరియు కంప్యూటర్ ఆపరేటర్, రాజమండ్రియందు హుకుంపేట ఆఫీస్‌నందు పనిచేయుటకు అనుభవము కలిగిన వ్యక్తులు కావలెను. అర్హతలు: MS Office మరియు Tally ERP9 నందు కనీసం 3 సంవత్సరములు అనుభవం కలిగి ఉండాలి. డిగ్రీ పాసై ఉండాలి. Ph: 76609 86227, చివరి తేది: 20-10-2024.

మండలాల వారీగా 10 రూ. నాన్‌వెజ్ పచ్చళ్ళు మార్కెటింగ్ చేయుటకు సేల్స్‌మేన్ కావలెను. జీతం: 20,000/- (టార్గెట్ బేస్) TA + DA. Cell: 86396 49728.

WANTED A multicrore Organisation requires ASSISTANT GENERAL MANAGERS, CHIEF MANAGERS - M/F 40+ Prefer: Result Oriented Dynamic Persons with Ambition to Earn More. Salary + Incentives C.V.SATYANARAYANA District Forest Officer (Rtd.) D.No.80-03-01/5, J.N.Road, RJY 94411 23957 70936 59282

రాజమండ్రి KEEL వ్యాపార సంస్థకుజాతీయ, అంతర్జాతీయ స్థాయి వ్యాపారాలలో అనుభవం కల ఇంగ్లీషులో మాట్లాడగలవారు కావలెను. Qlf: Any Business Degree, ఆకర్షణీయమైన జీతం. © 89195 49175.

అన్నవరంలో మా హోటల్‌నందు పనిచేయుటకు వంట మాస్టర్స్ కావలెను. (టీ, టిఫిన్స్, Veg మీల్స్ చేయుటకు). Cont: 81211 12239, 78930 55772.

శ్రీనివాస హోమ్‌కేర్‌లో పెద్దవారికి సేవలు చేయుటకు Exp. స్త్రీ/పురుషులు/ నర్సులు కావలెను. జీతం: 20,000/- నుండి 25,000/- వరకు ఇవ్వబడును. Hyd. లో. © 6301330889, 6300799407.

కాకినాడ, జవహర్‌వీధి, ఎస్.ఆర్. పెట్స్ జోన్‌లో పనిచేయుటకు కంప్యూటర్ అనుభవం కలిగిన యువకులు కావలెను. (టైమింగ్స్: 10-9.30). Cont: © 99853 78767.

సూపర్‌వైజర్స్, సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం. Cont: రంగ డిజిటల్స్, శశికాంత్ నగర్, కాకినాడ, సెల్: 91339 59999, 94904 49999.

రాజమండ్రి & కాకినాడ ప్రముఖ కలెక్షన్ ఏజెన్సీ నందు పనిచేయుటకు కలెక్షన్ & రికవరీ ఎగ్జిక్యూటివ్స్ మరియు టీం లీడర్స్ కావలెను. DRA సర్టిఫికెట్స్ ఉన్నవారికి ప్రాధాన్యత. సంప్ర: 99634 07777.

Hyd లో పనిచేయడానికి వెజ్/ నాన్‌వెజ్ మాస్టర్లు (జీ: 25 వేలు) కటింగ్ మాస్టర్ (జీ: 15 వేలు) హెల్పర్లు భార్యాభర్తలు (జీ: 23 వేలు) కావలెను. ఫ్రీ రూం, భోజనం. మైథిలీ క్యాటరింగ్. 9493931224, 7386951320.

కాకినాడ, రాజమండ్రి మరియు పరిసర పట్టణాల నుండి షాప్ టూ షాప్ సేల్స్ కొరకు ఫీల్డ్ సూపర్‌వైజర్స్ కావలెను. సంప్రదించండి. © 62816 98289, జీతం: 12,000 నుండి.

WANTED Project Manager, Civil Engineer, Civil Supervisor B.E/ B.Tech/ Diploma With Relevant Exp in Railway Projects. Koneru Constructions Pvt.Ltd. Patamata, Vijayawada-8 Cell/Whatsapp: 93900 40925 koneruconstructionspvtltd@gmail.com

కంప్యూటర్ టచ్ ఉన్నవారికి మంచి సొంత ఉపాధి అవకాశం. సంప్రదించు సమయం సా॥ 7 గం॥ల నుండి 10 గం॥ వరకు. Cont: 99491 25425.

వైజాగ్ దగ్గర మా డెయిరీ ఫామ్‌లో ఉండి పాలు తీయుటకు, ఆవుల సంరక్షణ చేయుటకు భార్యభర్తలు కావలెను. ఉచిత గృహం, పాలు ఇచ్చి. Rs. 20,000/- నెలకు ఇవ్వబడును. © 9347133239.

హైదరాబాదులో ఇంట్లో వంట పని చేయుటకు వంట మనిషి కావలెను. మంచి జీతం + అకామిడేషన్ + భోజనం కలదు. సంప్ర: 9100954953.

రాజమండ్రిలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేయుటకు డిగ్రీ పాస్/ ఫెయిల్ అయిన మగవారు కావలెను. రాజమండ్రి లోకల్‌వారు సంప్రదించండి. © 93463 35296, 93475 67631.

కాకినాడలో ప్రముఖ రియల్ ఎస్టేట్ ఆఫీస్‌లో పనిచేయుటకు టెలికాలర్స్ మరియు డోర్ టు డోర్ బ్రోచర్స్ పంచిపెట్టుటకు బాయ్స్ కావలెను. © 96188 98145.

తుని, అన్నవరం, కత్తిపూడి Paytmలో పనిచేయుటకు సేల్స్ ఆఫీసర్ కావలెను. Q: 10th, ఇంటర్. నెలకు 30,000/- సంపాదించుకోవచ్చు. బైక్, స్మార్ట్ ఫోన్ తప్పనిసరి. © 92995 09299.

ACCOUNTING

సీనియర్ అకౌంటెంట్ దగ్గర వర్క్ చేయుటకు అసిస్టెంట్ అకౌంటెంట్స్ కావలెను. Qlf: డిగ్రీ & టాలీ, కంప్యూటర్ బేసిక్ నాలెడ్జి. రాజమండ్రి లోకల్‌లో ఉన్న ఫ్రెషర్స్‌కి ప్రాధాన్యత. © 99664 38377.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 5.35 పై॥
అనపర్తి ఆఫీసు: 08857-226908

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.



ముఖ్య అతిథులతో విజేతలు

నన్నయలో భారత్-2047 కార్యక్రమాలు

నన్నయ విశ్వవిద్యాలయం, (రాజానగరం): [illegible] బృందాలుగా, భారత్ 2047 లక్ష్యంగా యువత పాత్ర గురించి వివిధ అంశాలలో ప్రజంటేషన్ ఇచ్చారు. కార్యక్రమాల ముగింపు సమావేశానికి ముఖ్యఅతిథిగా వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు పాల్గొని ఆయా పోటీలలో విజేతలకు బహుమతులు అందించారు. పి.వెంకటేశ్వరరావు, ఎ.విజయదుర్గ, రఘుభూషణం, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్	ధర (రూపాయల్లో)
[illegible]	11,500
[illegible]	17,500
[illegible]	15,500
[illegible]	16,500
[illegible]	14,500
[illegible]	14,000-15,000
[illegible]	13,500-14,000
[illegible]	3,750
కిలో	260

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	120-00
రిటైల్ లైవ్	142-00
డ్రెస్డ్	206-00
స్కిన్‌లెస్	234-00

92.7 FM Rajamahendravaram ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
ఆదివారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్	ఉ॥ 7 - ఉ॥ 9
టెస్ట్ డ్రైవ్	ఉ॥ 9 - ఉ॥ 10
ఎక్స్‌ట్రా డోస్	ఉ॥ 10 - మ॥ 2
ఈ వారం సినిమా	మ॥ 2 - సా॥ 5
ఇ-టాప్ 20	సా॥ 5 - రా॥ 7
హాష్‌ట్యాగ్	రా॥ 7 - రా॥ 9
ఈస్టార్-మీస్టార్	రా॥ 9 - రా॥ 10
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 10 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 9000180626, 9989993175

సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టండి


అధికారులతో సమీక్షిస్తున్న మధుసూదన్

గొల్లప్రోలు: ప్రజా సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఉప ముఖ్య మంత్రి పవన్‌కల్యాణ్ పీఎస్ మధుసూదన్ అధికారులను కోరారు. గొల్లప్రోలులో శనివారం ఆయన పర్యటించారు. అంతకుముందు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. తహసీల్దారు కార్యాలయ నిర్మాణం, యూపీహెచ్‌సీ భవనం, సూర్యుడు చెరువుగట్టుపై వాకింగ్ ట్రాక్ పనులు పరిశీలించారు. జూనియర్ కళాశాల, సూరంపేట వంతెన పనులు పరిశీలించారు. జగనన్నకాలనీ మార్గంలో వంతెన నిర్మాణం, ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు గురించి మాట్లాడారు. జూనియర్ కళాశాల భవన నిర్మాణం, తాటిపర్తిలో పదో తరగతి పరీక్ష కేంద్రం ఏర్పాటుపై చర్చించారు. ఎస్సీ కాలనీ మహిళలు తరలివచ్చి శ్మశానవాటికకు దారిలేక, వృద్ధులు పేరుకుపోయిన ఇబ్బం దిపడుతున్నామని మొరపెట్టుకున్నారు. నగర పంచాయతీ కమిషనర్ రవికుమార్, ఏఈ ప్రభాకరరావు, తహసీల్దారు కేవీవీ సత్యనారాయణ, ఎంఈవో-2 శివప్రసాద్, వైద్యాధికారులు సుబ్బారావు, రామకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అర్బన్ బ్యాంకు ఎన్నికల పోలింగ్

పిఠాపురం: పిఠాపురం కోటగుమ్మం సెంటర్‌లోని అర్బన్ క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీ పాలకవర్గం ఎన్నికలు ఆదివారం జరగనున్నాయి. పోటీలకు తొలుత 18 మంది నామినేషన్ దాఖలు చేయగా, ఆరుగురు ఉపసంహరించుకున్నారు. 12 మంది నిలిచారు. కూటమి ప్రభుత్వం తరఫున అయిదుగురు సభ్యులను మాత్రమే బలపరుస్తున్నట్లు చెప్పారు. దాంతో మిగిలినవారు పోటీ నుంచి వెనక్కి తగ్గి ఈ అయిదుగురికే మద్దతు తెలుపుతున్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పోలింగ్ జరగనుంది. అనంతరం ఓట్లు లెక్కించి గెలిచిన అభ్యర్థుల పేర్లు ప్రకటిస్తారు.

అప్రమత్తతే.. భక్తులకు రక్ష

● రాత్రి వేళ పాదయాత్ర విరామంతోనే మేలు ● జాతీయ రహదారిపై వాహనాలు ఢీకొని ప్రమాదాలు

న్యూస్‌టుడే - తుని, తుని పట్టణం

దసరా వేడుకలు ప్రారంభమైన నేపథ్యంలో వేలాది మంది భక్తులు భవానీ దీక్షలు చేపట్టారు. విజయవాడ అమ్మవారి దర్శనానికి పాదయాత్ర చేసుకుంటూ వెళ్తుంటారు. ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల నుంచి వందలాది మంది జిల్లా మీదుగా నడకసాగిస్తుంటారు. తుని, అన్నవరం, కత్తిపూడి, జగ్గంపేట, రాజానగరం, దివాన్‌చెరువు మీదుగా రోజుకు సుమారు 30-40 కిలోమీటర్లు ప్రయాణించి విజయవాడ చేరుకుంటారు. దసరా నవరాత్రుల్లో అమ్మవారిని దర్శించుకోవడానికి ప్రణాళిక చేసుకుంటున్నారు. అలాగే అయ్యప్పస్వామి, వెంకటేశ్వరస్వామి, సాయిబాబా, వినాయకస్వామి మాలధారులు ఆయా ప్రాధాన్య రోజుల్లో దీక్ష విరమించేందుకు ఆలయాలకు వెళ్తుంటారు. భక్తి పారవశ్యంతో అడుగులు వేస్తున్న మాలధారులకు కొన్ని సందర్భాల్లో అనుకోని రోడ్డు ప్రమాదం తీవ్ర విషాదం మిగుల్చుతోంది.

● 2022 డిసెంబరు 3న విజయవాడ అమ్మవారి దర్శనానికి నడిచి వెళ్తున్న భవానీ భక్తులపైకి అతివేగంగా కారు దూసుకుపోయింది. శ్రీకాకుళం జిల్లా జి.సిగడం మండలం పెనసాం గ్రామానికి చెందిన నలుగురు భవానీ భక్తులు తుని పట్టణ పరిధిలోకి ఉదయం 6 గంటలకు చేరగా.. అతివేగంగా వచ్చిన కారు వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఇద్దరు భక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరు త్రుటిలో తప్పించుకున్నారు.

● గతంలో అమ్మవారి దర్శనం ముగించుకుని భక్తులు బొలెరో వాహనంలో వెళ్తుండగా యలమంచిలి వద్ద బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. మరికొంత మంది గాయపడ్డారు.

● తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం అచ్చినపాలెం వద్ద జాతీయ రహదారిపై కాలినడకన వెళ్తున్న భవానీ భక్తులను వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొంది. అనకాపల్లి జిల్లా ఎలమంచిలి మున్సిపాలిటీ పరిధి అగ్రహారం గ్రామానికి చెందిన గొర్లె నానాజీ(29) అక్కడికక్కడే మృతిచెందారు. అదే గ్రామానికి చెందిన మోటూరు లక్ష్మణరావు, సుందరపు లక్ష్మణ్, గొర్లె శ్రీను స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ ఘటన 29.12.23న జరిగింది. స్వగ్రామం నుంచి విజయవాడ కనకదుర్గమ్మ గుడికి వెళుతుండగా ఈ ఘటన చోటుచేసుకుంది.

ఈ జాగ్రత్తలు అవసరం

✦ జిల్లాలో జాతీయ రహదారిపై ఎక్కడా సర్వీసు రోడ్డు లేదు. జాతీయ రహదారి పైన, పక్కన నడక సాగిస్తుంటారు. వాహనాలు పక్కనుంచి దాటి వెళ్లే సమయంలో ప్రమాదాలకు ఆస్కారం ఉంది.

✦ బృందాలుగా పాదయాత్ర చేసే సమయంలో ఒకరిద్దరు చొప్పున వెనుక వెనుక నడకసాగిస్తే మంచిది. ఎక్కువ మంది రోడ్డుపై పక్కపక్కనే నడిస్తే ఇబ్బందులు ఎదురుకావచ్చు.

✦ చీకటి పడకముందే పాదయాత్ర ముగించి దగ్గరలోని ఆలయాలు, ఇతర శుభ్రమైన ప్రదేశాల్లో విశ్రాంతి తీసుకోవడం మేలు. ఉదయం వెలుతురు వచ్చిన తర్వాత తిరిగి యాత్ర ప్రారంభించాలి.

✦ వాహన చోదకులు దూరం నుంచే గుర్తించేలా బ్యాగులకు లేదా చొక్కాలకు రేడియం స్టిక్కర్లు ఉంటే ఉపయోగకరంగా ఉంటుంది.



2022 డిసెంబరు 3న భక్తులపైకి కారు దూసుకువెళ్లిన సీసీ కెమెరా దృశ్యాలు (పాత చిత్రాలు)

✦ చాలా మంది భక్తులు ఆటోలు, చిన్న వాహనాలు, లారీలపై కిక్కిరిసి కూర్చుని రాకపోకలు సాగిస్తుంటారు. ఇది అత్యంత ప్రమాదకరం.

✦ కొంత మంది భక్తులు ఫోన్లలో మాట్లాడుకుంటూ, చెవిలో హెడ్ ఫోన్లు పెట్టుకుని భక్తి పాటలు వింటూ ముందుకు సాగుతుంటారు. ఇలాంటి సమయంలో వెనుక వచ్చే వాహనాల వారు హారన్ మోగించినా వినిపించే అవకాశం ఉండదు. భక్తులు ఇలా చేయకూడదు.

బృందాలుగా వెళ్తే రక్షణ కల్పిస్తాం

విజయవాడ అమ్మవారి దర్శనానికి పాదయాత్ర చేసుకుంటూ బృందాలుగా వెళ్లే భక్తులు తమకు సమాచారం ఇస్తే హైవే పెట్రోలింగ్ పోలీసు వాహనాల ద్వారా రక్షణ కల్పిస్తాం. భవానీ మాలధారులు జాతీయ రహదారిపై నడిచే సమయంలో అప్రమత్తంగా ఉంటూ తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ఏమైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి.

\- చెన్న కేశవరావు, రూరల్ సీఐ, తుని

రాజమాతంగి ఆరాధనతో స్వయం శక్తి


శ్రీపీఠంలో విల్లంబులు చూపుతున్న స్వామిజీ

సర్పవరం జంక్షన్, న్యూస్‌టుడే: రాజమాతంగి(రాజశ్యామల) అమ్మవారు నీలి వర్ణంలో ఉంటారు. రాముడు, కృష్ణుడికి అమ్మ నుంచే నీలి వర్ణం సంక్రమించిందంటారు. అమ్మవారి కృపతో మనకు స్వయంశక్తి లభిస్తుందని శ్రీపీఠం అధిపతి స్వామి పరిపూర్ణానంద సరస్వతి తెలిపారు. పీఠంలోని ఐశ్వర్యాంబిక అమ్మవారిని శనివారం రాజమాతంగిగా అలంకరించారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో మూడో రోజు పెద్దసంఖ్యలో మహిళలు లక్ష నిమ్మకాయలతో పూజలు నిర్వహించారు. గోశాల ప్రాంగణానికి అయోధ్య రామయ్యకు అలంకరించేందుకు 14 కేజీల వెండి, కేజీ బంగారంతో తయారుచేయించిన విల్లంబులను తీసుకురాగా భక్తులు దర్శించుకున్నారు. డీఎస్పీ రఘువీర్‌విష్ణు పర్యవేక్షణలో సీఐలు పెద్దిరాజు, చైతన్యకృష్ణ, రామారావు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

జిల్లా అగ్నిమాపక శాఖ ఉద్యోగుల సంఘం ఎన్నిక


ఉమ్మడి జిల్లా కార్యవర్గ సభ్యులు

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అగ్నిమాపక శాఖ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడిగా యాతం సతీష్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం కాకినాడ ప్రభుత్వ డ్రైవర్స్ అసోసియేషన్ భవనంలో సంఘ కార్యవర్గ సమావేశం జరిగింది. ఎన్నికల అధికారిగా పి.బాలకృష్ణ, సహాయ ఎన్నికల అధికారులుగా గణేష్, సప్తగిరి, పీవీవీ సత్యనారాయణ పర్యవేక్షణలో నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా సతీష్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా రామకృష్ణదొర, కార్యదర్శిగా జీవీ మోహన్, జాయింట్ సెక్రటరీగా ఆకుల నరేష్‌కుమార్, కోశాధికారిగా సుబ్రహ్మణ్యం, సలహాదారుగా మురళీకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కమిటీకి జిల్లా అగ్నిమాపక అధికారి వి.సుబ్బారావు, అభినందనలు తెలిపారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కె.చంద్రశేఖర్, నాయకులు కేవీఎస్‌ఎన్ మూర్తి, డీఎల్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కార్తికంలో భక్తులకు పకడ్బందీగా ఏర్పాట్లు


అధికారులు, వైదిక బృందంతో చర్చిస్తున్న ఈవో రామచంద్రమోహన్

అన్నవరం, న్యూస్‌టుడే: రానున్న కార్తిక మాసంలో సత్యదేవుని దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఈవో కె.రామచంద్రమోహన్ ఆదేశించారు. కార్తికమాసంలో ఏర్పాట్లు, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలపై ఇంజినీర్లు, ఏఈవోలు, సూపరింటెండెంట్లు, వైదిక బృందంతో ఆయన సమీక్షించారు. నవంబరు 13న తెప్పోత్సవం సందర్భంగా పంపా సరోవరం చెంతనే చేపట్టాల్సిన ఏర్పాట్లు, హంస వాహనం సిద్ధం చేయడంపై చర్చించారు. 15న గిరిప్రదక్షిణ మహోత్సవానికి సుమారు లక్ష మందికి పైగా హాజరయ్యే అవకాశమున్న నేపథ్యంలో గత అనుభవాల దృష్ట్యా భక్తులకు ఇబ్బందులు లేకుండా చేపట్టాల్సిన చర్యలు, తాగునీరు, ఆహారం అందించడం, భద్రత, వైద్యసేవలు తదితరాలపై చర్చించారు. నవంబరు 1 నుంచి డిసెంబరు 1 వరకు కార్తికంలో దశమి, ఏకాదశి, పౌర్ణమి, శని, ఆది, సోమవారాల్లో రద్దీ దృష్ట్యా పటిష్ఠ క్యూలైన్లు, దర్శనాలు, వ్రతాల నిర్వహణపై సమీక్షించారు. పర్వదినాల్లో తెల్లవారుజామునే వ్రతాలు, సర్వదర్శనాలు ప్రారంభించడానికి ప్రణాళిక చేశారు. రవాణా, భద్రత, వసతి, భక్తులకు పులిహోర, దద్దోజనం పంపిణీ, ట్రాఫిక్ నియంత్రణ, పారిశుద్ధ్యం తదితర అంశాలు చర్చకు వచ్చాయి. త్వరలోనే అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి మరోసారి ఆయా అంశాలపై చర్చిస్తామని అధికారులు తెలిపారు.

బాలలు విద్యకు దూరం కాకూడదు


శిరస్త్రాణం అందిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత

దానవాయిపేట (రాజమహేంద్రవరం): ప్రాథమిక విద్యకు దూరమవుతున్న బాలలను గుర్తించి, వారిని బడికి పంపే దిశగా చర్యలు ముమ్మరం చేయాలని ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత పేర్కొన్నారు. బాలల హక్కుల పరిరక్షణ, కనిపించకుండా పోయిన బాలల కోసం వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థలతో డీఎల్‌ఎస్‌ఏ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ బడి ఈడు పిల్లలంతా విద్యాభ్యాసానికి దూరం కాకుండా చూడాలన్నారు. వారి హక్కులకు భంగం కలిగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి కె.ప్రకాష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

● యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా సహకారంతో పలువురు ఫీడర్ల గుమస్తాలకు న్యాయమూర్తి చేతులు మీదుగా శిరస్త్రాణాలు పంపిణీ చేశారు.

ట్రిపుల్‌ఐటీ విద్యార్థులకు దసరా సెలవులు

వేంపల్లె, న్యూస్‌టుడే: రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక, సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) పరిధిలోని ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీ విద్యార్థులకు ఆదివారం నుంచి ఈ నెల 13 వరకు దసరా సెలవులు ప్రకటించారు. ఈ మేరకు ఆయా ట్రిపుల్‌ఐటీల్లోని తెలుగు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు శనివారం స్వగ్రామాలకు బయలుదేరారు. ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీకి సంబంధించిన బస్సులతో విద్యార్థులను వేంపల్లెకు తరలించారు. అలాగే క్యాంపస్ నుంచి కడప, పులివెందుల, రాయచోటి, అనంతపురం, తిరుపతికి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. సెలవులకు వెళ్లిన విద్యార్థులు ఈ నెల 14న ఆయా క్యాంపస్‌లకు చేరుకోవాలని ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్ పేర్కొన్నారు.

'ప్రజల దృష్టి మరల్చే ప్రయత్నం'


మాట్లాడుతున్న వైకాపా జిల్లా అధ్యక్షుడు కన్నబాబు

సర్పవరం జంక్షన్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో నిత్యావసరాల ధరలు పెరిగి సామాన్య, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారి దృష్టి మరల్చేందుకే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తిరుమల వేంకటేశ్వర స్వామిని రాజకీయాల్లోకి లాగారని వైకాపా జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు ఆరోపించారు. కాకినాడలో శనివారం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నెయ్యి కల్తీ ఘటన వెలుగులోకి వస్తే దానిని గత ప్రభుత్వానికి అంటగట్టారన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ, మహిళల రక్షణ తదితరాలపై మాట్లాడారు.

ఇష్టపడి పనిచేస్తే మంచి ఫలితాలు


క్రీడల్లో ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించిన నాలుగో ఏడాది విద్యార్థులకు ట్రోఫీని అందజేస్తున్న ప్రిన్సిపల్

మసీదు సెంటర్(కాకినాడ), న్యూస్‌టుడే: విద్యార్థులు ఇష్టపడి పనిచేస్తే మంచి ఫలితాలు సాధిస్తారని రాష్ట్ర డీఎంఈ, ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వీసీ, కాకినాడ ఆర్ఎంసీ కళాశాల ప్రిన్సిపల్ డా.డీఎస్‌వీఎల్ నరసింహం పేర్కొన్నారు. శనివారం కాకినాడ రంగరాయ వైద్య కళాశాల ఆడిటోరియంలో కళాశాల 66వ వార్షిక దినోత్సవాన్ని నిర్వహించారు. వైస్‌ప్రిన్సిపల్ డా.ఎ.విష్ణువర్ధన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా డీఎంఈతో పాటు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.లావణ్యకుమారి, పాడేరు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా.డి.హేమలతాదేవి, విజయనగరం ప్రభుత్వ వైద్య కళాశాల కమ్యూనిటీ మెడిసిన్ ప్రొఫెసర్ డా.బి.దేవీమాధవి, స్నేహ ఆసుపత్రి ఎండీ డా.కె.రామ్‌స్వరూప్ జవహర్ హాజరయ్యారు. తొలుత వైస్‌ప్రిన్సిపల్ డా.ఎ.విష్ణువర్ధన్ కళాశాల వార్షిక నివేదిక వివరించారు. 2023-24 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులకు నిర్వహించిన పరీక్షల్లో ప్రతిభ చూపిన వారికి బంగారు పతకాలు, బహుమతులు, ధ్రువపత్రాలు అందజేశారు. కళాశాల విద్యార్థులకు, వైద్య నిపుణులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు.


సాయి అనిరుధ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపల్ నరసింహం, తదితరులు

బ్యాచ్ విజేతలుగా అనిరుధ్, పార్వతి..

డీఎంఈ మాట్లాడుతూ కళాశాల హౌస్‌సర్జన్లు డా.ఎ.సాయి అనిరుధ్, డా.పార్వతి బ్యాచ్ విజేతలుగా నిలిచారన్నారు. సాయి అనిరుధ్ 9, పార్వతి 7 బంగారు పతకాలు సాధించారన్నారు. కళాశాల బయట ఏర్పాటు చేసిన ఫొటోఫ్రేమ్‌లో విద్యార్థులు స్వీయచిత్రాలు తీసుకుని సందడి చేశారు. బంగారు పతకాలు, ధ్రువపత్రాలు సాధించిన విద్యార్థులు తల్లిదండ్రులు కలిసి అవార్డులు అందుకున్నారు. కార్యక్రమంలో ఫోరెన్సిక్ హెచ్‌వోడీ ఉమామహేశ్వరరావు, జనరల్ సర్జరీ అసోసియేట్ ప్రొఫెసర్ డా.కె.శైలజ, వైద్యనిపుణులు తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక, నృత్య కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

ఉత్సాహంగా అథ్లెటిక్ పోటీలు



క్రీడాకారుడి హైజంప్

శ్యామలాసెంటర్(రాజమహేంద్రవరం): రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో సందడిగా సాగుతున్నాయి. జిల్లా అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో రెండోరోజు శనివారం అండర్-16, 18, 20 విభాగాల్లో లాంగ్ రన్, 4×100, 4×400 రిలే, మిక్స్‌డ్ రిలే పోటీలు, జావెలిన్ త్రో, లాంగ్‌జంప్, హైజంప్ విభాగాల్లో పోటీలు జరిగాయి. విజేతలకు సంఘ కార్యదర్శి ఎన్.శివకుమార్, పాఠశాలల క్రీడల మాజీ కార్యదర్శి సింహాద్రి రావు తదితరులు బహుమతులు అందజేశారు.


అండర్-20 4×400 రిలే విభాగంలో విజేతలు

విజేతలు వీరే: అండర్-20 విభాగంలో కాకినాడ జిల్లాకు చెందిన సీహెచ్ వెంకటరమణ 110 మీటర్ల హర్డిల్స్‌లో ద్వితీయ, 400 మీటర్ల హర్డిల్స్‌లో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. అయిదు కిలోమీటర్ల పరుగులో తూర్పు గోదావరి జిల్లాకు చెందిన ఎం.అనుపమ ప్రథమస్థానంలో నిలిచారు. అండర్-16 విభాగం 60 మీటర్ల పరుగులో కాకినాడ జిల్లాకు చెందిన ఎల్.హన్నా ఎలిజిబెత్ ద్వితీయ, జావెలిన్‌త్రోలో ఎస్.చాందిని ప్రథమ స్థానాలు పొందారు.

మహారాజా ఆశయ సాధనకు కృషి


మహారాజా విగ్రహానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

పిఠాపురం, న్యూస్‌టుడే: పిఠాపురం మహారాజా ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఆదిత్య పాఠశాల, మహారాజా సూర్యారావు బహుద్దూర్ ఆధ్వర్యంలో మహారాజా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వర్మ మాట్లాడుతూ గతంలో పేద విద్యార్థుల ఆకలి తీర్చేందుకు మహారాజా 500 ఎకరాలు ఇస్తే ఆ భూమి కబ్జాకు గురైందని, దానిని సంరక్షించి రూ.50 లక్షల ఆదాయానికి తీసుకొచ్చినట్లు చెప్పారు. శ్రీసంస్థానం ఆధ్వర్యంలో ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్ నడిపించినట్లు చెప్పారు. ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ శేషారెడ్డి, డైరెక్టర్ శృతిరెడ్డి మాట్లాడుతూ విద్య, వైద్యానికి మహారాజా ఎన్నో విరాళాలిచ్చారన్నారు. ఆయన జీవిత చరిత్రకోసం ప్రత్యేక గ్రంథాలయం ఏర్పాటు చేస్తామని, సూర్యారాయ నిఘంటువు భావితరాలకు అందిస్తామన్నారు. ఈ సందర్భంగా మూడు రోజులపాటు జరిగిన క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. 1,700 మందికి 10 రకాల క్రీడా పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపల్స్ విజయసారథి, శ్రీనివాస్, రేవతి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం


పద్మావతి (పాత చిత్రం)

గొల్లప్రోలు, తొండంగి, న్యూస్‌టుడే: గొల్లప్రోలు మండలం చెందుర్తి కూడలి జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తొండంగి మండలం పాత పెరుమాళ్లపురానికి చెందిన కుక్కా శివశ్రీను (20), పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండకు చెందిన గింబలి పద్మావతి (18) మృత్యువాత పడ్డారు. ఎస్సై రామకృష్ణ వివరాల ప్రకారం.. చెందుర్తి కూడలిలో మలుపు తిరుగుతున్న వ్యాను కాకినాడ నుంచి కత్తిపూడి వైపు వెళుతున్న ద్విచక్ర వాహనం ఢీకొన్నాయి. వ్యాను కింది భాగంలోకి ద్విచక్ర వాహనం దూసుకుపోవడంతో పద్మావతి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. తీవ్రంగా గాయపడిన శివశ్రీనును పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. శివశ్రీను తండ్రి మణబ్బాయి ఫిర్యాదుతో కేసు నమోదుచేసినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

చదువుకోసం వచ్చి మృత్యువాత..: చిన్నప్పట్నుంచి బాగా చదువుతోందని ఉన్నత చదువులకు పంపిస్తే దసరా సెలవుల్లో కోట దుర్గమ్మతల్లి ఉత్సవాలకు వస్తూ బిడ్డ మృత్యువాతపడిందని పద్మావతి తల్లిదండ్రులు విలపిస్తున్నారు. పద్మావతి కోరంగి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసీ కళాశాలలో మెరిట్ సీటు సాధించి బీఫార్మసీ రెండో సంవత్సరం చదువుతోంది. దసరా సెలవులకు వస్తుండగా రోడ్డు ప్రమాదం ఆమెను కబళించిందన్నారు. తండ్రి శ్రీనివాసరావు, సోదరుడు సంజయ్ డ్రైవర్లుగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. తల్లి సత్యవతి గృహిణి. కోరంగి నుంచి కత్తిపూడి వచ్చి అక్కడి నుంచి బస్సు ఎక్కి వస్తానని తండ్రితో పద్మావతి చెప్పిందని బంధువులు తెలిపారు. శనివారం ఉదయం 10.30 గంటల ప్రాంతంలో ఫోన్ చేయగా ప్రమాదం గురించి పోలీసులు చెప్పారన్నారు.


శివశ్రీను (పాత చిత్రం)

స్నేహితుడి బండిపై వెళ్లి..: ద్విచక్ర వాహనం అంటే ఎంతో సరదా పడే వాడని, స్నేహితుడి బండి తీసుకుని వెళ్లి శవమయ్యాడని శివశ్రీను కుటుంబసభ్యులు రోదిస్తూ చెప్పారు. తండ్రి మణబ్బాయి వ్యవసాయ కూలీ కాగా తల్లి సత్యవతి చిరు దుకాణం నిర్వహిస్తుంటారు. మణబ్బాయికి కుమారుడితోపాటు మరో ఇద్దరు కుమార్తెలున్నారు. శివశ్రీను డిగ్రీ ప్రైవేటుగా చదువుతూ.. రెండేళ్లుగా ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు.

కాకినాడ

రైతుబజార్‌లో నిన్నటి కూరగాయల ధరలు(కిలోకు)




గాంధీనగర్: టమాటా - 40, వంకాయలు - 40,45,56, బెండకాయలు - 36, పచ్చిమిర్చి - 28,32, కాకరకాయ - 40, బీర - 38,46, కాలీఫ్లవర్ - 15,20, క్యాబేజీ - 38, క్యారెట్ - 44, దొండకాయలు - 60, బంగాళాదుంపలు - 30,36, ఉల్లి - 50,55, గోరుచిక్కుడు - 34, దోసకాయలు - 32, ఆనపకాయ - 25,30, పొట్లకాయ - 18,20, అరటికాయ - 6,7, చిక్కుడు - 64,110, చేమదుంపలు - 30,40, ముల్లంగి - 10,12, బీట్‌రూట్ - 38, కీరదోస - 30, బీన్స్‌కాయలు - 70, అల్లం - 50, క్యాప్సికం - 80, బొబ్బర్లు - 46, చిలకడదుంపలు - 40, మామిడికాయ - 15,18, నిమ్మకాయలు(డజన్) - 24,48,60.

నగరంలో సినిమాలు

గాంధీనగర్: ఆనంద్ సినిమాస్ 4స్క్రీన్- దేవర పార్ట్ 1, దక్షిణ, సత్య సుందరం, దేవి మల్టీప్లెక్స్ 4స్క్రీన్- దేవర పార్ట్ 1, సత్యం సుందరం, కాళీ, లక్ష్మి- దేవర పార్ట్ 1, సత్యగౌరి- జిగ్రా, తిరుమల - మన్మథ, సినీస్క్వేర్ 1- మత్తువదలరా 2, సినీస్క్వేర్ 2- స్త్రీ2, శ్రీప్రియ - రామ్‌నగర్ బన్నీ, పద్మప్రియ- దేవర పార్ట్ 1, సూర్య1 (వాకలపూడి) - దేవర పార్ట్ 1, సూర్య 2- మిస్టర్ సెలబ్రిటీ, శ్రీనివాసా(వేళంగి)- దేవర పార్ట్ 1.



వార్షికోత్సవంలో విద్యార్థులు (అంతర్చిత్రం) ప్రిన్సిపల్ నరసింహం



ఆనందాల పాటో..



సంతోషాల ఆటా.. పాటా..

యువరాగాలు

ఓ వైపు వైద్యరంగంలోని నిపుణుల అనుభవ పాఠాలు. మరోవైపు యువ వైద్య విద్యార్థులు ఆటపాటలు. రంగరాయ వైద్య కళాశాల వార్షికోత్సవ వేడుక అంగరంగ వైభవంగా జరిగింది. పతకాలు అందుకుంటున్న తమ పిల్లల్ని చూసి తల్లిదండ్రులు ఉద్వేగానికి లోనయ్యారు. విద్యార్థుల ఆటపాటలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి.

– ఈనాడు, కాకినాడ, న్యూస్‌టుడే, మసీదుసెంటర్



మేము పాడితే లోకమే ఆడదా..



తీపి జ్ఞాపకాలు

తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే..



నేను ఆర్ఎంసీలో హౌస్‌సర్జన్ చేస్తున్నా. తొమ్మిది బంగారు పతకాలు రావడం ఆనందంగా ఉంది. నాన్న ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపల్, అనస్థీషియా హెచ్ఓడీ డా.ఎ.విష్ణువర్ధన్. అమ్మ ఏపీఎల్ సత్యవతి ప్రముఖ గైనకాలజిస్ట్. జనరల్ మెడిసిన్, పీడియాట్రిక్స్ అంశాల్లో యూనివర్సిటీ టాపర్‌గా నిలిచాను. అన్ని సబ్జెక్టుల్లో కలిపి అత్యధిక మార్కులు సాధించాను. 10వ తరగతిలో పాఠశాల టాపర్. ఇంటర్‌లో జిల్లా టాపర్‌గా నిలిచాను. ఎంబీబీఎస్ చేసే సమయంలో పలు జాతీయ, విశ్వవిద్యాలయం స్థాయి పోటీల్లో పాల్గొన్నా. క్రిస్టల్ క్లాస్9 టెక్నాలజీపై బయోకెమిస్ట్రీ సెమినార్‌లో బంగారు పతకం, ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, మంగళగిరిలో నిర్వహించిన జాతీయస్థాయి పోటీల్లో విజేత జట్టు కెప్టెన్‌గా ఉన్నా. ఎంబీబీఎస్ మొదటి ఏడాది విశ్వవిద్యాలయంలోనే మూడోస్థానంలో నిలిచాను. ఆంధ్ర మెడికల్ కళాశాల విశాఖపట్నంలో నిర్వహించిన జాతీయస్థాయి అనాటమీ సెమినార్ పోటీలో బంగారు పతకం సాధించా. తల్లిదండ్రులు, ప్రిన్సిపల్, కళాశాల సిబ్బంది ప్రోత్సాహంతో విజయాన్ని సాధించాను. గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ అవ్వడమే లక్ష్యం. ప్రముఖులతో పాటు అమ్మ నాన్న చేతులమీదుగా పతకాలు అందుకోవడం మధురానుభూతి.

– అథలూరి సాయి అనిరుధ్

బంగారు తల్లి...



నాన్న పతంజలి, షిప్పింగ్ కంపెనీ మేనేజింగ్ పార్ట్‌నర్, అమ్మ పద్మావతి గృహిణి. ఆర్ఎంసీలో ఎంబీబీఎస్ చదివి, జీజీహెచ్‌లో హౌస్‌సర్జన్‌గా సేవలందిస్తున్నా. అనాటమీలో రంగాచారి ప్రైజ్ బహుమతి, అనాటమీలో యూనివర్సిటీ బంగారు పతకం, మైక్రోబయాలజీలో ప్రతిభ కనబరిచినందుకు మరో బంగారు పతకం, ఫోరెన్సిక్ మెడిసిన్‌లో బి.సృజన ఎండోమెంట్ బహుమతి, వివిధ అంశాలకు సంబంధించి 7 బంగారు పతకాలు అందుకోవడం ఆనందంగా ఉంది. మా అంకుల్ సీహెచ్ గణపతి శాస్త్రి, తల్లిదండ్రులు ఇచ్చిన ప్రోత్సాహం, స్ఫూర్తితో కష్టపడి చదివాను. ఆర్ఎంసీ కళాశాల అధ్యాపకులు, ప్రిన్సిపల్ డా.నరసింహం, వైస్‌ప్రిన్సిపల్ డా.విష్ణువర్ధన్, స్నేహితుల ప్రోత్సాహంతో సాధించగలిగాను. జనరల్ సర్జరీలో పీజీ చేయాలనేది నా లక్ష్యం.

– చంద్రబట్ల పార్వతి

‘సూపర్ బజార్’ పేరు కాపాడుకోవాలి

కాకినాడ నగరం: కాకినాడలోని సూపర్ బజార్‌కు ఆరు దశాబ్దాల చరిత్ర ఉందని నగర ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. ఆ సంస్థకున్న బ్రాండ్‌ను కాపాడుకోవాల్సిన బాధ్యత కార్యవర్గంపై ఉందన్నారు. మెయిన్ రోడ్డులోని ప్రధాన కార్యాలయంలో శనివారం సూపర్ బజార్ పాలవర్గ ప్రమాణ స్వీకారం జరిగింది. ఛైర్మన్‌గా పెసంగి ఆదినారాయణ, డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై కార్యవర్గ సభ్యులను ఉద్దేశించి మాట్లాడారు. నూతన ఛైర్మన్ ఆదినారాయణ మాట్లాడుతూ కార్యవర్గ సభ్యులు, ప్రజా ప్రతినిధుల సహకారంతో సూపర్ బజార్‌ను అభివృద్ధి చేస్తానన్నారు. నిత్యావసరాల పంపిణీకి సంబంధించి ప్రభుత్వ టెండర్లలో పాలుపంచుకుని ఆదాయ అభివృద్ధికి పాడుపడతానన్నారు. రిటైల్ దుకాణాల తరహాలో ఇంటింటికీ సరుకులు తీసుకెళ్లే విధానాన్ని ప్రవేశపెడతామన్నారు. సీఈవో వి. శివాజీ గణేష్, నాయకులు గ్రంధి బాబ్జి, మల్లిపూడి వీరు, బలసాడి రంగారావు, పైడా వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న ఆదినారాయణ, చిత్రంలో ఎమ్మెల్యే కొండబాబు

డీఎఫ్‌వోగా రవీంద్రనాథ్‌రెడ్డి

మసీదుసెంటర్(కాకినాడ): కాకినాడ అటవీ శాఖ అధికారిగా డి.రవీంద్రనాథ్‌రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన శ్రీ సత్యసాయి జిల్లా డీఎఫ్‌వోగా పనిచేసి బదిలీపై కాకినాడ డీఎఫ్‌వోగా నియమితులయ్యారు. ఈయన 2016 ఐఎఫ్ఎస్ బ్యాచ్‌కు చెందినవారు. ఇప్పటివరకూ డీఎఫ్‌వోగా పనిచేసిన ఎస్.భరణి బదిలీపై చిత్తూరు జిల్లా అటవీ శాఖ అధికారిణిగా బదిలీ అయ్యారు.

ఏ బిడ్డా.. ఇది నా అడ్డా..!

నగరంలో వైకాపా నేతల ఇష్టారాజ్యం

అధికారం పోయినా వైకాపా నేతల ఆగడాలకు అడ్డు, ఆపూ ఉండట్లేదు. డ్రెయిన్లు మూసి, మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ ప్లాట్‌ఫారాన్ని ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్నారు. అయినా కాకినాడ నగరపాలక సంస్థ అధికారులు అటువైపు కన్నెత్తి చూడట్లేదు. గత వైకాపా పాలనలో అప్పటి స్థానిక ప్రజాప్రతినిధి అండ చూసుకుని మురుగు కాలువలను మూసేసి ఇష్టానుసారంగా దుకాణాలు నెలకొల్పారు. ప్రశ్నిస్తే సదరు ప్రజాప్రతినిధి ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని అధికారులు వణికిపోయారు. వైకాపా ప్రభుత్వం పోయి, కూటమి ప్రభుత్వం వచ్చినా వారి దందా యథేచ్ఛగా సాగుతున్నాయి. నగరం నడిబొడ్డున నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాల్లోనే వీరి ఆక్రమణలు ఎక్కువగా ఉన్నాయి. స్థానిక సంతచెరువు వద్ద అమ్మవారి ఆలయం ఈశాన్య ప్రాంతం మూసేశారు. డ్రెయిన్‌పై వైకాపా నేతలు నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను ఇటీవల నగరపాలిక అధికారులు కూల్చేశారు. ఆక్రమణలపై అధికారులు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు.

న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్



రామారావుపేట మూడు దీపాల కూడలిలో డ్రెయిన్‌ను ఆక్రమించి వ్యాపారం

నగరంలో ఎక్కడెక్కడంటే..

★ స్థానిక రామారావుపేటలోని మూడు దీపాల కూడలిలో గత వైకాపా ప్రభుత్వంలో స్థానిక ప్రజాప్రతినిధికి బినామీగా ఉన్న ఒక నేత తన వ్యాపార కార్యకలాపాల కోసం డ్రెయిన్‌ను మూసేశారు. సదరు మాజీ ప్రజాప్రతినిధి గ్రావెల్, మట్టి తరలింపు అక్రమాలను తన భుజాన వేసుకున్న ఈ నేత ఇక్కడ ఒక హోటల్ నిర్వహిస్తున్నారు. హోటల్ బయట డ్రెయిన్‌ను మూసేశారు.

★ స్థానిక రామారావుపేటలోని కొండయ్యపాలెం పైవంతెన దిగువన ఒక వైకాపా నేత తన స్నేహితుడికి నిర్మించిన భవనంలో మరో వైకాపా నేత హోటల్ నిర్వహిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా దీన్ని నిర్మించారు. ఇక్కడ డ్రెయిన్‌ను ఆక్రమించి, వ్యాపార కార్యకలాపాలు సాగిస్తున్నారు.

★ గాంధీనగర్‌లోని మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఒక వైకాపా నేత ప్లాట్‌ఫారం మూసి వ్యాపార కార్యకలాపాలు సాగిస్తున్నారు. ఒక దుకాణాన్ని రెండుగా విభజించి, ఒక దాన్ని అద్దెకిచ్చి ఆయాచిత లబ్ధి పొందుతున్నారు. వాస్తవంగా లీజు పొందిన హక్కుదారుడు లేడు. దాన్ని వైకాపా నేత ఆధీనంలోకి తీసుకుని వాడుకుంటున్నారు.

★ గాంధీనగర్ మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లోని ఒక దుకాణంలో వైకాపా నేత వ్యర్థాల నిల్వ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ప్లాట్‌ఫారంను ఆక్రమించి, కొంత భాగాన్ని దుకాణంగా మార్చేశారు. ఇక్కడ రైతు బజారుకు వచ్చే ప్రజలు, పక్క దుకాణాల లీజుదారులు ఇబ్బంది పడుతున్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

గాంధీనగర్, న్యూస్‌టుడే: సమాజంలో పారిశుద్ధ్య కార్మికులు వివక్షతను ఎదుర్కొంటూ చాలీచాలని జీతాలతో ఇబ్బందులు పడుతున్నారని, వారి సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం బోర్డు ఏర్పాటు చేయాలని ఏపీ ఆర్‌సీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు పేర్కొన్నారు. ఏఐఎఫ్‌టీయూ అనుబంధంగా పారిశుద్ధ్య కార్మికుల సమాఖ్య ఆవిర్భావ సభ శనివారం గాంధీభవన్‌లో జరిగింది. ఏఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కె.అంజిబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కె.వీరాంజనేయులు, ప్రధాన వక్తగా ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు కరీంబాషాలు హాజరయ్యారు. మెయిన్ రోడ్డులోని ఎల్ఐసీ కార్యాలయం నుంచి గాంధీభవన్‌కు భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం గాంధీభవన్‌లో జరిగిన ఆవిర్భావ సభలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘ గౌరవాధ్యక్షుడిగా అంజిబాబు, కన్వీనర్‌గా బి.ఏసు, కోకన్వీనర్లుగా ఎం.సత్యం, నారాయణమూర్తిలతో పాటు మరో ఏడుగురు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ముఖ్య అతిథులు ఆంజనేయులు, కరీంబాషాలు మాట్లాడారు. కార్మిక చట్టాలను సక్రమంగా అమలు చేయట్లేదని, దుస్తులు, ఇతర సామగ్రి ఇవ్వట్లేదన్నారు. ఏపీ ఆర్‌సీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రమేష్, జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు, రాష్ట్ర నాయకులు దుర్గారావు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీరాంజనేయులు

2027 నాటికి టీబీ అంతమే లక్ష్యం

మసీదుసెంటర్ (కాకినాడ): 2027 నాటికి జిల్లాలో టీబీ, కుష్ఠు వ్యాధులను అంతం చేయడమే మనందరి లక్ష్యమని డీఎంహెచ్‌వో డా.నరసింహానాయక్ పేర్కొన్నారు. శనివారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌వో, టీబీ, కుష్ఠు నివారణాధికారి డా.రమేష్ సంయుక్త ఆధ్వర్యంలో వైద్యాధికారులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ వ్యాధులకు సంబంధించిన వివరాలను యాప్‌లో ఎలా నమోదు చేయాలో ఏఎన్ఎం, ఎంపీహెచ్‌ఏ, ఎంఎల్‌హెచ్‌పీలకు తెలిపేందుకు వైద్యాధికారులకు శిక్షణ ఇచ్చామన్నారు. పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల్లోని సిబ్బందికి అవగాహన కల్పించాలన్నారు.

7 నుంచి తక్షణ ప్రవేశాలు

కాకినాడ నగరం: పీఆర్ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి డిగ్రీలో మిగిలిపోయిన సీట్ల భర్తీకి 7, 8, 9 తేదీల్లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ డా.బి.తిరుపాణ్యం, అడ్మిషన్స్ డైరెక్టర్ డా.కె.లక్ష్మణ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే ప్రవేశాలకు సంబంధిత ధ్రువపత్రాలతో హాజరు కావాలన్నారు. రూ.400 రిజిస్ట్రేషన్ ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లించాలన్నారు. ఈనెల 11, 12, 13 తేదీల్లో రూ.100 ఆలస్య రుసుం చెల్లించి 12న జరిగే ప్రవేశాలకు హాజరు కావచ్చన్నారు. ముందు జరిగిన ప్రవేశాల్లో సీటు పొందిన అభ్యర్థులు అర్హులు కాదన్నారు.

15న అరుణాచలానికి ప్రత్యేక బస్సు

సాంబమూర్తినగర్(కాకినాడ): కాకినాడ డిపో నుంచి అరుణాచలానికి ప్రత్యేక బస్సు నడపనున్నట్లు డిపో అసిస్టెంట్ కమిషనర్ ఎంయూవీ మనోహర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 15న మధ్యాహ్నం ఒంటిగంటకు డిపో నుంచి బయల్దేరి కాణిపాకం, శ్రీపురం దర్శనం అనంతరం అరుణాచలం చేరుకుంటుందన్నారు. గిరి ప్రదక్షిణ పూర్తయిన తర్వాత పెద్దకంచి, కాళహస్తి దర్శనం అనంతరం తిరిగి 18వ తేదీ రాత్రి 10 గంటలకు కాకినాడకు చేరుకుంటుందన్నారు. బస్సుకు అడ్వాన్సు రిజర్వేషన్ సౌకర్యం ఉందన్నారు. టిక్కెట్ ధర రూ.3100 అన్నారు.. వివరాలకు 73829 10869 నంబరులో సంప్రదించాలన్నారు.

వాలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

గాంధీనగర్: వాలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, బకాయి పెట్టిన నాలుగు నెలల వేతనం చెల్లించాలని, జాబ్‌చార్ట్ ప్రకటించాలని, ఏపీ గ్రామ, వార్డు వాలంటీర్ల సంఘ జిల్లా సమావేశం డిమాండ్ చేసింది. శనివారం కచేరిపేట సుందరయ్యభవన్‌లో ఏపీ గ్రామ, వార్డు వాలంటీర్ల సంఘ జిల్లా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంఘ జిల్లా కన్వీనర్‌గా చెక్కల రాజ్‌కుమార్, కోకన్వీనర్లుగా ఏ.ప్రకాష్‌బాబు, అప్పారావు, కె.దుర్గాప్రసాద్, వరలక్ష్మి, డి.రమేష్, రవికుమార్, రాజా, నాగలక్ష్మి, వరుణ్‌లతో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈనెల 27న కాకినాడలో భారీ ర్యాలీ నిర్వహించాలని సమావేశంలో తీర్మానించారు.

ఆహార సలహా సంఘాల ఏర్పాటుకు వినతి

సాంబమూర్తినగర్: రాష్ట్ర విభజనకు ముందు కొణిజేటి రోశయ్య ముఖ్యమంత్రిగా ఉన్న హయాంలో ఏర్పడిన ఆహార సలహా సంఘాలు దశాబ్దకాలంగా ఏర్పడలేదని పౌర సంక్షేమ సంఘం పేర్కొంది. కూటమి ప్రభుత్వం పౌర సరఫరాల శాఖ నిర్వహణలో రేషన్ డిపో స్థాయి నుంచి మండల, జిల్లా, రాష్ట్రస్థాయి వరకు ఆహార సలహా సంఘాలు ఏర్పాటు చేయాలని కోరింది. ఈ మేరకు సీఎం, డిప్యూటీ సీఎం, పౌర సరఫరాల శాఖ మంత్రికి వినతి పంపినట్లు పౌర సంఘం కన్వీనర్, సామాజిక వేత్త దూసర్లపూడి రమణరాజు శనివారం తెలిపారు.



బాలాత్రిపుర సుందరి ఆలయంలో..



పెద్ద శివాలయంలో



భానుగుడి ఉషారాజరాజేశ్వరి



సంతచెరువు కనకదుర్గ అమ్మవారు



మాధవనగర్‌లో..



రామారావుపేట శివాలయంలో..

వీణాపాణి నమోస్తుతే..

గాంధీనగర్, న్యూస్‌టుడే: శరన్నవరాత్రి మహోత్సవాల వేళ అమ్మవారు శనివారం వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. సూర్యారావుపేటలోని బాలాత్రిపుర సుందరి అమ్మవారి ఆలయం తెల్లవారు జామునుంచే భక్తజనంతో కిక్కిరిసింది. పుస్తకపాణిగా దర్శనమిచ్చారు. అయ్యప్ప స్వామి ఆలయంలో సామూహిక కుంకుమార్చనలు జరిగాయి. సంతచెరువు వద్ద కనకదుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని అన్నపూర్ణగా అలంకరించారు. పెద్ద శివాలయంలో బాలాత్రిపుర సుందరి సరస్వతిదేవిగా అలంకరించారు. భానుగుడిసెంటర్‌లోని ఉషా బాలాత్రిపుర సుందరి సమేత భానులింగేశ్వర స్వామి ఆలయంలో అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. సినిమారోడ్డులోని శ్రీకామాక్షీ అమ్మవారు, రైల్వేకాలనీలోని శ్రీకనకదుర్గ అమ్మవారు, రామారావుపేటలోని అన్నపూర్ణాదేవి, జగన్నాథపురంలోని జమ్మిచెట్టు సెంటర్ వద్ద గల కనకదుర్గ ఆలయంలో కుంకుమార్చనలు జరిగాయి.

నేటినుంచి సీవైఎఫ్ యువజన మహోత్సవాలు


గాంధీనగర్, న్యూస్‌టుడే: క్రిష్టియన్ యూత్ ఫెలోషిప్ (సీవైఎఫ్) అంతర్జాతీయ యువజన మహోత్సవాలను ఆదివారం నుంచి మంగళవారం వరకు నిర్వహించనున్నట్లు సీవైఎఫ్ అంతర్జాతీయ డైరెక్టర్ బీహెచ్‌వి మూర్తిరాజు తెలిపారు. నేటి యువతకు చరవాణిపై ప్రత్యేక అవగాహన కల్పించేందుకు ఈసారి ప్రత్యేక నాటికలు రూపొందించామన్నారు. కుళాయిచెరువు ప్రాంగణంలోని ఫ్యాబిన్ కన్వెన్షన్ హాల్లో ఉదయం 9 నుంచి రాత్రి 9 వరకు ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. విజ్ఞానం నేర్చుకోవాల్సిన సమయంలో అజ్ఞానంలోకి వెళ్తున్నారని, చరవాణుల్లో వెకిలి వేషాలతో అవమానం, అంధకారంలోకి వెళ్తూ ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. రోజూ సాయంత్రం 6 గంటల నుంచి ఉచిత ప్రవేశం ఉంటుందని మూర్తిరాజు పేర్కొన్నారు. యువత, విద్యార్థులు రావాలని కోరారు.

ముంపు నివారణకు చర్యలు చేపట్టాలి

కాకినాడ కలెక్టరేట్: నగరంలో చిన్నపాటి వర్షం కురిసినా ప్రధాన రహదారులు ముంపుబారిన పడుతున్నాయని, నివారణకు చర్యలు తీసుకోవాలని కాకినాడ నగర పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు శనివారం ఒక ప్రకటనలో కోరారు. మెయిన్‌రోడ్డు, సినిమారోడ్డు ప్రాంతాల్లో ముంపు సమస్యతో వ్యాపారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్‌లో కాకినాడ నగరపాలక సంస్థ ముంపు నివారణ కార్యాచరణ పేర్కొనాలని కోరారు.

చంద్రశేఖర్ సేవలు ప్రశంసనీయం

కాకినాడ నగరం: సామాజిక సేవా కార్యక్రమాలకు సంబంధించి పద్మశ్రీ గ్రహీత సంకురాత్రి చంద్రశేఖర్ సేవలు ఆదర్శనీయమని యంగ్ మైండ్స్ సంస్థ వ్యవస్థాపకుడు వాకాడ వెంకటరమణ పేర్కొన్నారు. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం యంగ్ మైండ్స్ సంస్థ కార్యాలయంలో ఆయనను సత్కరించారు. వెంకటరమణ మాట్లాడుతూ సంకురాత్రి ఫౌండేషన్ ద్వారా శారదా విద్యాలయాన్ని స్థాపించి 250 మంది పేద పిల్లలకు ఉచిత విద్య అందిస్తున్నారని చెప్పారు. కిరణ్ కంటి ఆసుపత్రితో పేదలకు వైద్యాన్ని అందిస్తున్నారని గుర్తుచేశారు. కామేశ్, కరీమ్, గోపి, యోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



చంద్రశేఖర్‌ను సత్కరిస్తున్న సభ్యులు



51 వసంతాల అపురూప జ్ఞాపకం

కాజులూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో 1973లో 10వ తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు 51 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. ఆరుపదుల వయసులో చిన్నపిల్లల్లా సందడి చేశారు. ఆ బ్యాచ్‌కు చెందిన 22 మంది శనివారం కాకినాడలో కలుసుకున్నారు. అందులో ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం మాజీ ఉప కులపతి డా.కె.బాబ్జి కూడా ఉన్నారు. ఆయన ఆధ్వర్యంలో నడుస్తున్న లైఫ్‌లైన్ ఆసుపత్రిలోనే వీరంతా కలుసుకున్నారు. తమకు అక్షరాలు నేర్పిన బడిని అభివృద్ధి చేసేందుకు వారంతా సంకల్పించారు. అనంతరం తమకు పాఠాలు బోధించిన నలుగురు ఉపాధ్యాయులు సర్వేశ్వరరావు, కామేశ్వరరావు, ఆంజనేయులు, వెంకటేశ్వరరావులను సత్కరించారు. వెలుగుబంట్ల గంగరాజు, పెద్దింశెట్టి రాముడు, మహాలక్ష్మి, నున్న రామకృష్ణ, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, కాకినాడ నగరం

జిల్లా క్రీడాకారుల ప్రతిభ

మసీదు సెంటర్ (కాకినాడ): వైఎస్ఆర్ కడప జిల్లా రైల్వేకోడూరులో జరిగిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ స్కూల్ గేమ్స్ తైక్వాండో పోటీల్లో అండర్-19 విభాగంలో జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించారని తైక్వాండో సంఘ జిల్లా కార్యదర్శి, అండర్-19 జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బి.అర్జునరావు, శివరామకృష్ణ శనివారం తెలిపారు. డి.టి.జగన్, ఎన్ అఖిల్, ఎ.సత్యసాయిరాం, పీబీ చైతన్య, పి.ధనుష్, జి.యశ్విత, వి.వర్ష, పీపీ దర్శిని పతకాలు సాధించారన్నారు. ఒక బంగారు, 4 రజత, 3 క్యాంస పతకాలు వచ్చాయన్నారు.

సబ్ జైలు పరిశీలన

మసీదు సెంటర్: ఆర్థిక స్తోమత లేనివారు మండల లీగల్ సర్వీస్ అథారిటీకి దరఖాస్తు చేసుకుంటే ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామని కాకినాడ ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి వి.సావిత్రి తెలిపారు. శనివారం న్యాయవిజ్ఞాన సదస్సులో భాగంగా కాకినాడ ప్రత్యేక సబ్‌జైలును సూపరింటెండెంట్ ఎం.వీరబాబుతో కలిసి న్యాయమూర్తి సందర్శించారు. వారికి అందుతున్న సౌకర్యాలను తెలుసుకున్నారు. వంటగది, మహిళా రిమాండ్ ఖైదీలు ఉండే ప్రత్యేక సెల్ తదితర ప్రాంతాలు పరిశీలించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ జైలు నుంచి వెళ్లేటప్పుడు ఖైదీలు మంచి పౌరులుగా మారాలన్నారు. ఎంఎల్ఎస్‌సీ ఇన్‌ఛార్జి డి.సంధ్య, నాగజ్యోతి, దమయంతి పాల్గొన్నారు.

వంతెన దిగువన ప్రమాదాలు నివారించాలి

కాకినాడ కలెక్టరేట్: నగరంలో కొత్తగా అందుబాటులోకి తెచ్చిన కొండయ్యపాలెం పైవంతెన దిగువ భాగాన రోడ్డు ప్రమాదాలను నివారించాలని సిటిజన్స్ ఇనీషియేట్ కార్యదర్శి దువ్వూరి సుబ్రహ్మణ్యం శనివారం ఒక ప్రకటనలో కోరారు. వంతెన దిగువన రామారావుపేట కూడలి వద్ద ఆలయాలు, పాఠశాల, వాణిజ్య సంస్థలు ఉన్నాయని, దీనిపై రాకపోకలు సాగిస్తున్న వాహనాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇక్కడ పోలీసు బీట్ ఏర్పాటు చేసి ప్రమాదాలు నివారించాలన్నారు. దీనిపై ఎస్పీకి వినతిపత్రం ఇచ్చామన్నారు. ఇప్పటికైనా పోలీసుశాఖ చర్యలు చేపట్టాలని కోరారు.

కాకినాడ గ్రామీణం

• కాకినాడ గ్రామీణం • పెద్దాపురం • పిఠాపురం

ఉపాధి హామీ పథకంతో రహదారుల నిర్మాణం

తాళ్లరేవు, న్యూస్‌టుడే: పోలేకుర్రు, సుంకరపాలెం పంచాయతీ కార్యాలయాల వద్ద శనివారం ఉపాధి హామీ పథకం గ్రామ సభలు నిర్వహించారు. సర్పంచులు వెంటపల్లి నూకరాజు, టిళ్లపూడి నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఉపాధి హామీ నిధులు పోలేకుర్రులో రూ.30 లక్షలు, సుంకరపాలెంలో రూ.25 లక్షలతో సీసీ రోడ్లు నిర్మాణాలు చేపట్టనున్నట్లు పంచాయతీ కార్యదర్శి జ్యోతి సుధ తెలిపారు. తాగునీరు, డ్రెయినేజీలు, శ్మశాన వాటికలు, ఇంటిపన్నుల సమస్యలపై చర్చించారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సుకీర్తన, మాజీ సర్పంచి దడాల బుజ్జిబాబు, జక్కల ప్రసాదబాబు, వడ్డమూరి సతీష్, దున్నా సింహాద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పెద్దాపురం: పెద్దాపురం మహారాణి కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరంలో డిగ్రీ ప్రథమ ఏడాదిలో చేరేందుకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జ్యోతిర్మయి తెలిపారు. ఈనెల 7 నుంచి 10 వరకు ప్రవేశాలు కల్పిస్తామని, ఆసక్తిగలవారు ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

గృహ నిర్మాణ శాఖ ఏఈగా శ్రీనివాస్

పెద్దాపురం, న్యూస్‌టుడే: గృహ నిర్మాణ శాఖ పట్టణ ఏఈగా ఒగ్గు శ్రీనివాస్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. పశ్చిమ గోదావరి జిల్లా గోపాలపురం నుంచి ఆయన బదిలీపై వచ్చారు. గతంలో ఇక్కడ వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన ఆయన పదోన్నతిపై ఇతర జిల్లాకు వెళ్లి ఏఈగా వచ్చి బాధ్యతలు తీసుకున్నారు.

మున్సిపల్ సర్వేయర్ నియామకం

పెద్దాపురం, న్యూస్‌టుడే: పెద్దాపురం పురపాలక సంఘం సర్వేయర్‌గా సీహెచ్. నిరంజన్‌రావు నియమితులయ్యారు. తొండంగి మండల సర్వేయర్‌గా పనిచేస్తున్న ఆయన బదిలీపై రానున్నారు. పురపాలక సంఘానికి దాదాపు 35 ఏళ్ల నుంచి సర్వేయర్ లేరు. పట్టణంలో సర్వే సమస్యలపై అధికారులు చలానా రుసుం స్వీకరించి మండల సర్వేయరుకు ఆయా దస్త్రాలు పంపేవారు. పని ఒత్తిడితో భూ, సర్వే సమస్యల పరిష్కారంలో తీవ్ర జాప్యం చోటు చేసుకునేది. తాజాగా సర్వేయరు నియామకంతో ఆలాంటి ఇబ్బందులు తొలగనున్నాయి.

సేవలు మరువలేనివి

పెద్దాపురం: పంచాయతీ కార్యదర్శుల సేవలు మరువలేనివని తెదేపా రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి పుట్టా గంగాధర చౌదరి అన్నారు. శనివారం పెద్దాపురం పంచాయతీ కార్యదర్శి మన్యం శ్రీనివాసరావు బదిలీపై పెద్దాడ గ్రామానికి వెళుతున్న సందర్భంగా ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం శ్రీనివాసరావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో ఎం.సత్యనారాయణరెడ్డి, సర్పంచి కలవల కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పడి పూజ



తాళ్లరేవు, న్యూస్‌టుడే: మాదవరాయుని పేటలో వేంకటేశ్వర స్వామి ఆలయ అర్చకులు ఖండవిల్లి కేశవాచార్యులు గురుస్వామి ఆధ్వర్యంలో శనివారం రాత్రి భవానీ భక్తులు సామూహిక పడి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. సతీష్, నారాయణమూర్తి, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

కళాశాల.. దప్పికతో చదివేదెలా?

గత ప్రభుత్వం విద్యాలయాల్లో ప్రారంభించిన నాడు-నేడు పనులు నేటికీ పూర్తి కాలేదు. నిధులు సక్రమంగా విడుదల చేయకపోవడంతో దయనీయ పరిస్థితులు నెలకొన్నాయి. ముఖ్యంగా ఈ పనుల్లో భాగంగా అందించిన మంచినీటి ప్లాంట్లు మరమ్మతులకు నోచుకోవడం లేదు. దాంతో విద్యార్థులకు మంచి నీరు అందడం లేదు. గుత్తేదారు సంస్థను సంప్రదించినా.. పట్టించుకోవడం లేదని నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. – న్యూస్‌టుడే, పిఠాపురం

పిఠాపురంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో దాదాపు 600 మంది చదువుతున్నారు. ఈ కళాశాలకు పిఠాపురం, కొత్తపల్లి, గొల్లప్రోలు మండలాలతో పాటు శంఖవరం, తొండంగి, సామర్లకోట, కాకినాడ గ్రామీణ మండలాల నుంచి విద్యార్థులు వస్తుంటారు. ఈ కళాశాలలో సరైన మౌలిక సదుపాయాలు లేక వారంతా అవస్థలు పడేవారు. దాంతో గత ప్రభుత్వం 2022లో రూ.80 లక్షలతో నాడు-నేడు పనులు మొదలుపెట్టింది. రెండేళ్లు గడుస్తున్న ఈ పనులు ఇంకా కొన సాగుతూనేఉన్నాయి. ఎన్నికలకు ఆరు నెలల ముందు నుంచి ఈ పనులకు సంబంధించి నిధుల విడుదల నిలిచిపోయింది. దాంతో పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. నాడు-నేడు పనుల్లో భాగంగా కళాశాలలో తాగు నీరు, మరుగుదొడ్లకు నీటి సరఫరా, మరుగుదొడ్ల నిర్మాణం, ఫర్నీచర్, విద్యుత్తు వైరింగ్, మేజర్, మైనర్ మరమ్మతులు, ప్రహరీ వంటి పనులకు అనుమతులిచ్చారు. నాడు-నేడు పనులకు కేటాయించిన నిధుల్లో రూ.12 లక్షలతో రెండు మంచినీటి ప్లాంట్లు ఓ గుత్తేదారు సంస్థ అందజేసింది. రూ.33 లక్షల విలువైన 200 బెంచీలు కూడా మరో సంస్థ ద్వారా వచ్చాయి. ఇక తల్లిదండ్రుల కమిటీ ఖాతాకు రూ.33,57,106 జమ చేయగా అందులో 29,10,300 ఖర్చు చేశారు. ఇంకా తల్లిదండ్రుల కమిటీ వద్ద రూ.2,10,000 నిధులున్నాయి. పనుల ప్రారంభం నుంచీ నిధుల జమలో ఆలస్యమవుతోంది. దాంతో పనులు సకాలంలో పూర్తి కాలేదు. ఇక్కడ తరగతి గదుల కొరత ఎక్కువగా ఉంది. కానీ నాడు-నేడు నిధులు గదుల నిర్మాణానికి వినియోగించొద్దని చెప్పడంతో మౌలిక సదుపాయాలకే ఖర్చు చేస్తున్నారు.



నిరుపయోగంగా మారిన తాగునీటి ప్లాంటు

మూలకుచేరిన మంచినీటి ప్లాంట్లు

కళాశాలలో 600 మంది విద్యార్థులు, పది మంది అధ్యాపకులు, మరో పది మంది అధ్యాపకేతర సిబ్బంది ఉన్నారు. వీరందరికీ స్వచ్ఛమైన తాగునీరందించేందుకు నాడు-నేడు పనుల్లో భాగంగా రూ.12 లక్షలతో రెండు మంచినీటి వాటర్ ప్లాంట్లు అందించారు. ఇవి కొద్ది నెలలుగా పనిచేయడం లేదు. గుత్తేదారు సంస్థకు సమాచారం ఇచ్చినా మరమ్మతులు చేయడం లేదు. దాంతో డబ్బాలతో అందించే మంచినీరు సరిపోక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. నాడు-నేడు పనుల నిధులు రూ.80 లక్షలు ప్రకటించినా.. అందులో బెంచీలు, మంచినీటి ప్లాంట్లకే రూ.45 లక్షల విలువైన సామగ్రి ఇచ్చారనే ఆరోపణలున్నాయి.

పట్టించుకోవడం లేదు..

నాడు-నేడు పనుల్లో భాగంగా జూనియర్ కళాశాలకు రెండు చోట్ల రూ.12 లక్షలతో రెండు మంచినీటి ప్లాంట్లు ఏర్పాటు చేశారు. ఇవి అందించిన ఆరు నెలలకే పాడైపోయాయి. గుత్తేదారు సంస్థకు సమాచారం ఇచ్చినా రేపు, మాపు వస్తామంటూ.. ఆలస్యం చేస్తున్నారు. దాంతో మంచినీటి సమస్య నెలకొంది. మాకు అందించిన నిధులతో పనులు సక్రమంగా పూర్తి చేశాం. – కేశవరావు, ప్రిన్సిపల్

మేమున్నాం.. మీకు తోడుగా

రోడ్డుపక్కన చెత్త తొలగింపు



సర్పవరం జంక్షన్: రమణయ్యపేట పంచాయతీ గైగోలుపాడు ఎఫ్‌సీఐ కాలనీ కాలువ గట్టుపై చెత్త పేరుకుపోవడంతో కాలనీవాసులు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి శనివారం తీసుకువచ్చారు. వెంటనే పంచాయతీ కార్యదర్శి జొన్నాడ నరసింహారావుకు తెలుపగా స్పందించారు. పంచాయతీ సిబ్బందిని, ట్రాక్టర్లు పంపి చెత్త డంపింగ్‌యార్డుకు తరలించారు.

స్పందనకు వందనం

సమస్య: సామర్లకోట రింగ్ సెంటర్ నుంచి రైల్వేగేటు రోడ్డులో వాహనాల రాకపోకల సమయంలో దుమ్ము, ధూళి రేగుతోంది. కళ్లలో పడుతుండటంతో వాహనదారులు ముక్కు, మొహం మూసుకుని వాహనాలు నడుపుతూ తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. **– మేడిశెట్టి శివ, సామర్లకోట**

సమాధానం: దశలవారీగా రోడ్డుపై మట్టిని తుడిపించి నీటితో కడిస్తున్నాం. ఇలా పూర్తిస్థాయిలో రోడ్డుపై ధూళి లేకుండా చర్యలు తీసుకుంటాం. **– రాజశేఖర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

సమస్య: పెదపూడి మండలం జి.మామిడాడ ఎల్.ఎన్.పురం వద్ద, బిక్కవోలు రోడ్డు శివాలయం వద్ద రోడ్డు పెద్ద పెద్ద గుంతలు పడి ఉంది. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలి. **– స్థానికులు, జి.మామిడాడ.**

సమాధానం: ఆ ప్రాంతాలను పరిశీలించి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం. **– లోవరాజు, ర.భ.శాఖ ఏఈ. పెదపూడి**

సమస్య: పిఠాపురం మండలం కందరాడలో రోడ్డు పక్కనే చెత్త వేస్తున్నారు. దాంతో ఆయా ప్రాంతాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. గాలికి చెత్త ఎగిరొచ్చి ప్రయాణికుల కళ్లలో పడుతోంది. **– సత్యనారాయణ, పిఠాపురం**

పరిష్కారం: సమస్య గురించి ఎంపీడీవో చిన్నారావుకు వివరించగా.. వెంటనే స్పందించారు. చెత్త తొలగింపునకు చర్యలు చేపట్టారు.

సమస్య: గొల్లప్రోలు పోలీసుస్టేషన్ ఎదురుగా ఎస్సీపేటకు వెళ్లే మార్గంలో రోడ్డుపై చెత్త చేరి ఇబ్బందులు పడుతున్నాం. **– సుబ్రహ్మణ్యం, గొల్లప్రోలు**

పరిష్కారం: సమస్యను పారిశుద్ధ్య పర్యవేక్షణాధికారి రఘుప్రసాద్‌కు తెలుపగా స్పందించారు. రోడ్డుపై చేరిన చెత్తను తొలగింపజేశారు.

– న్యూస్‌టుడే, సామర్లకోట, పెదపూడి, పిఠాపురం, గొల్లప్రోలు

సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: కాకినాడ గ్రామీణం: 80085 74325
పెద్దాపురం: 80085 74198, పిఠాపురం: 80085 65544

వన్యప్రాణులపై అవగాహన అవసరం

తాళ్లరేవు, న్యూస్‌టుడే: మడ అడవుల్లో ఉండే వన్యప్రాణులు, మడ వృక్ష జాతుల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎస్.ఎస్.ఆర్.వరప్రసాద్ అన్నారు. చొల్లంగిపేట వివేకానంద ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో వన్యప్రాణుల వారోత్సవంలో భాగంగా మడ అడవుల విశిష్టత, వన్యప్రాణుల సంరక్షణ, వాతావరణంలో వస్తున్న మార్పులపై విద్యార్థులకు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ మహేష్ శనివారం అవగాహన కల్పించారు. ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ వీరభద్రరావు, ఎఫ్‌బీవోలు ధనంజయ, ధనలక్ష్మి, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా సర్వసభ్య సమావేశం

కొత్తపల్లి, న్యూస్‌టుడే: ప్రజలు, గ్రామ సమస్యల పరిష్కారం, అభివృద్ధికోసం చర్చించుకోవాల్సిన మండల సర్వసభ్య సమావేశం మూడేళ్లుగా మొక్కుబడిగా సాగుతోంది. మండలంలో పాలకవర్గం ఏర్పడినప్పటి నుంచి పూర్తిస్థాయిలో అధికారులు, పాలకులు హాజరుకావడం లేదు. శనివారం జరిగిన సర్వసభ్య సమావేశాన్నీ తూతూమంత్రంగా నిర్వహించి ముగించేశారు. పలువురు ఎంపీటీసీ సభ్యులు వరుసగా హాజరుకాకపోయినా చర్యలు శూన్యం. ఎంపీడీవో వెంకటనారాయణ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఎలాంటి నివేదిక, ప్రణాళికలు వెల్లడించకుండా సమావేశం ముగించారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి



దడాల నానాజీ

పిఠాపురం, న్యూస్‌టుడే: పిఠాపురం ఏడుకాలువల ప్రాంతం సమీపంలోని పీబీసీ కాలువలో వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన చోటు చేసుకుంది. సమాచారం తెలుసుకున్న అతడి సోదరుడు పిఠాపురం పోలీసుకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వారి వివరాల మేరకు.. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం పాలతేరుకు చెందిన నానాజీ అయిదేళ్ల క్రితం కాకినాడ గ్రామీణ మండలం రామేశ్వరంలోని అత్తవారింటికి వచ్చాడు. భార్య రాధాదేవి, ఇద్దరు మగ పిల్లలు అక్కడే ఉంటున్నారు. అయిదు నెలలుగా పిఠాపురంలో ఉంటూ ఓ కేబుల్ ఆపరేటర్ వద్ద పని చేస్తున్నాడు. శుక్రవారం అర్ధరాత్రి పీబీసీ కాలువలో నానాజీ మృతదేహం ఉందని అతని కుటుంబ సభ్యులకు ఓ వ్యక్తి సమాచారం ఇచ్చాడు. నానాజీ సోదరుడు అరుణ్‌శేఖర్ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారొచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. బాధిత కుటుంబ సభ్యులు మాత్రం ఎవరో కావాలనే నానాజీని హత్య చేశారని ఆరోపిస్తున్నారు.



శ్రమదానం చేస్తున్న విద్యార్థులు

రహదారిపై గుంత పూడ్చివేత

పెద్దాపురం, న్యూస్‌టుడే: పెద్దాపురం-జగ్గంపేట ప్రధాన రహదారిలోని గుంతను జవహర్ నవోదయ విద్యార్థులు శనివారం శ్రమదానంతో పూడ్చారు. ఈ మార్గంలోని గుంతలతో ఆరు నెలలుగా ద్విచక్ర వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. నవోదయ వ్యాయామ ఉపాధ్యాయుడు ఆర్.సత్యనారాయణ సిమెంట్, ఇసుక, కాంక్రీట్ కొనుగోలు చేసి ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులతో శ్రమదానం చేయించి గుంతను పూడ్పించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డి.చక్రవర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్యదర్శికి సత్కారం

తాళ్లరేవు, న్యూస్‌టుడే: కోరంగి నుంచి పటవల బదిలీపై వచ్చిన పంచాయతీ కార్యదర్శి రామరాజును శనివారం పంచాయతీ కార్యాలయంలో తెదేపా నాయకులు భజన సత్తిబాబు, దంగేటి అప్పన్న, కొత్తూరు కాశీ ఈశ్వరుడు, కోటిపల్లి దొరబాబు, మేకల కృష్ణ సత్కరించారు.

ఈ-క్రాప్ నమోదు తీరుపై తనిఖీ

గొల్లప్రోలు: ఈ-క్రాప్‌లో నమోదు వివరాలను మండల వ్యవసాయశాఖ అధికారి సత్యనారాయణ శనివారం పరిశీలించారు. చేబ్రోలులో పర్యటించి పంటల సాగును పరిశీలించి దస్త్రాలు తనిఖీ చేశారు.

ఆరు దరఖాస్తులు

పిఠాపురం: పిఠాపురం నియోజకవర్గంలో మద్యం దుకాణాలకోసం ఇప్పటి వరకు ఆరు దరఖాస్తులు అందాయని సీఐ శివరామరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలో 22 దుకాణాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఈ నెల 9వ తేదీ వరకు గడువుందన్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లోనూ దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు.

మంత్రి లోకేశ్‌కు వినతి

సర్పవరం జంక్షన్: కాకినాడ జిల్లా తెదేపా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాసబాబా శనివారం ఉండవల్లిలో మంత్రి నారా లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కాకినాడ గ్రామీణంలో పంతం నానాజీ విజయానికి కృషి చేసినందుకు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యం ఇవ్వాలని కోరానని తెలిపారు.



పెద్దాపురప్పాడులో ఉమాపార్వతీదేవి



తాటిపర్తిలో చంద్రగంటదేవిగా..



దుర్గాడ లలితామాత



అన్నపూర్ణాదేవిగా గోకుల్‌గార్డెన్‌లో



పాదగయలో అన్నపూర్ణగా



తూర్పుపేట కనకదుర్గమ్మ



కాండ్రకోటలో అన్నపూర్ణదేవి

విశేష రూపాలు.. అమ్మ ఆశీస్సులు

కరప, గొల్లప్రోలు, పిఠాపురం, కొత్తపల్లి, సామర్లకోట, సర్పవరం జంక్షన్, పెద్దాపురం, తాళ్లరేవు: శరన్నవరాత్రుల్లో భాగంగా కరపలోని శ్రీపర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారిని పుస్తకపాణిగా అలంకరించారు. నడకుదురులో సామూహిక వ్రతాలు జరిపారు. వాకాడలో అన్నపూర్ణాదేవిని, యండమూరు, కొంగోడు, గొర్రిపూడి, కొరిపల్లి, గురజనాపల్లి, పెనుగుదురు, పెద్దాపురప్పాడు, సిరిపురం వేళంగి, వేములవాడ, కూరాడ, జడ్.భావారం, అరట్లకట్ట, గురజనాపల్లి తదితర గ్రామాల్లో అభిషేకాలు నిర్వహించారు. తాటిపర్తిలోని అపర్ణాదేవిని శనివారం చంద్రగంటాదేవిగా యాలుకులతో అలంకరించారు. దుర్గాడ శివాలయంలో లలితాదేవిని అలంకరించారు. కరణంగారితోట కనకదుర్గమ్మ ఆలయంలో శనివారం బోనాలతో గ్రామోత్సవం నిర్వహించారు. జనసేన నాయకుడు మర్రెడ్డి శ్రీనివాస్ దర్శించుకున్నారు. పిఠాపురం పాదగయ క్షేత్రంలో రాజరాజేశ్వరి అమ్మవారు అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. పురుహూతిక అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. ఈవో విశ్వనాథరాజు పాల్గొన్నారు. మంగితుర్తిలో దుర్గమ్మతల్లి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే వర్మ సతీమణి లక్ష్మీదేవి పూజల్లో పాల్గొని భక్తులతో కలిసి బోనాలు తీసుకెళ్లారు. కొత్తపల్లి కొమరగిరి శ్రీబాలదుర్గాదేవి గాయత్రీదేవి అవతారంలో దర్శనమిచ్చారు. ✦ కుమారారామ భీమేశ్వరాలయంలో బాలాత్రిపురసుందరి అమ్మవారు గాయత్రిదేవిగా దర్శనమిచ్చారు. ఈవో నీలకంఠం ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ✦ రమణయ్యపేటలోని గోకుల్‌గార్డెన్ శ్రీకామాక్షి అమ్మవారికి, తూరంగి శ్రీకనకదుర్గాదేవి ఆలయంలో అన్నపూర్ణాదేవి అలంకరణ చేశారు. ✦ పెద్దాపురం దుర్గమ్మ, మరిడమ్మ, నూకాలమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురపాలికసెంటర్‌లోని దుర్గమ్మను శాకంబరిగా అలంకరించారు. సినిమా సెంటర్, వరహాలయ్యపేట, రామారావుపేట, కొండయ్యపేట, కుమ్మరవీధి, బంగారమ్మగుడి వీధి, పాత ప్రభుత్వాసుపత్రివీధి, గణేష్‌నగర్‌కాలనీ, బొమ్మల గుడివీధి, కట్టమూరుపుంత రహదారిలోని దుర్గమ్మ ఆలయాల్లో పూజలు నిర్వహించారు. ✦ తాళ్లరేవు తూర్పుపేటలో అన్నపూర్ణాదేవిగా కనకదుర్గమ్మ, జార్జిపేటలో గాయత్రీదేవిగా, కొత్తకోరంగిలో అన్నపూర్ణా దేవిగా దర్శనమిచ్చారు.



మంగితుర్తిలో ఊరేగింపు



కరపలో పుస్తకపాణి



పురుహూతిక అమ్మవారు



సామర్లకోటలో గాయత్రిదేవి



తూరంగిలో అన్నపూర్ణాదేవి



గొల్లప్రోలులో బోనాల ఊరేగింపు

దర్శనాల ఆదాయం రూ.3.83 లక్షలు

పెద్దాపురం: తిరుపతి శ్రీశృంగార వల్లభస్వామివారిని శనివారం భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకునారు. భక్తుల దర్శనాలు, ప్రసాద విక్రయాల ద్వారా రూ.3.83 లక్షల ఆదాయం లభించిందని ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి దర్శనానికి వచ్చిన భక్తులకు ప్రసాదంగా పులిహోర పంపిణీ చేశామన్నారు. అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు, పెద్దింటి పురుషోత్తమాచార్యులు ప్రత్యేక పూజలు జరిపించారు.

అందరి సహకారంతోనే గ్రామాభివృద్ధి

కాజులూరు: ప్రజలందరి సహకారంతోనే గ్రామాభివృద్ధి సాధ్యమౌతుందని బంధనపూడి సర్పంచి డేగల తిరుమలవేణి అన్నారు. శనివారం గ్రామసభ నిర్వహించారు. ప్రజల నుంచి ఇప్పటివరకు జరిగిన అభివృద్ధి పనులు, ఇక నుండి జరగాల్సిన పలు అభివృద్ధి పనుల గురించి ప్రజల నుంచి వినతులు సేకరించారు. అత్యవసర పనులకు పంచాయతీ నిధులు లేకపోయినా అవి వచ్చేలోపు తన స్వంత నిధులు ఖర్చుచేసి సంక్రాంతి లోపు పనులు పూర్తి చేయిస్తానని ఎన్నారై డాక్టర్. డేగల నాగేంద్ర హామీ ఇచ్చారు. అధికారులు, కూటమి నాయకులు, పాల్గొన్నారు.

వరిలో దోమ, ఎండాకు తెగులు

పెద్దాపురం, న్యూస్‌టుడే: సార్వా వరి పంట చివరిదశలో ఉందని, దోమ, ఎండాకు తెగులు నివారణకు చర్యలు తీసుకోవాలని పెద్దాపురం వ్యవసాయ స్థానం అధిపతి డాక్టర్ రామభద్రరాజు సూచించారు. శిక్షణ, సందర్శన కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన మాట్లాడారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని పలు గ్రామాల్లో వరిలో ఎండాకు తెగులు ఆశించిందన్నారు. దీని నివారణకు నీటి యాజమాన్యం, నత్రజని ఎరువులు ఆపేసి పొటాష్‌నిచ్చే మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎకరాకు 20 కిలోలు చల్లాలని సూచించారు. ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా పైమెట్రోజైన్ 0.6 గ్రాము లేదా డైనోటెఫ్యూరాన్ 0.4 గ్రాము లేదా ట్రైఫ్లూమిజోపెరిమ్ 0.48 మిల్లీలీటర్లను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏరువాక కోఆర్డినేటర్ డాక్టర చల్లా నరసింహారావు, బీకే మల్లికార్జునరావు, జ్యోతిర్మయి, డాక్టర్ సునీత పాల్గొన్నారు.

కనకదుర్గమ్మకు ఆభరణాలు



ఆలయ కమిటీ ప్రతినిధులకు పాదుకలందిస్తున్న సత్యనారాయణ

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: దుర్గాడలోని కనకదుర్గమ్మకు వెండితో తయారు చేసిన పాదుకలను అదే గ్రామానికి చెందిన పూసల వీర వెంకట సత్యనారాయణ శనివారం అందజేశారు. అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం ఆలయ కమిటీ ప్రతినిధులకు రూ.50 వేల విలువైన ఆభరణాలు అందించారు.

మహిళ మృతిపై కేసు

మసీదు సెంటర్ (కాకినాడ): అనారోగ్య సమస్య తట్టుకోలేక పురుగులమందు తాగి ఓ మహిళ మృతిచెందిన ఘటనపై కరప పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. కరప మండలం, యండమూరుకు చెందిన రాయుడు సత్యవతి(52) ఈనెల 3న భర్తతో కలిసి స్థానిక ఆలయంలో భజనకు వెళ్లారు. తిరిగొస్తుండగా మార్గమధ్యలో కళ్లు తిరిగి పడిపోయారు. ఈ క్రమంలో మోకాళ్ల నొప్పి భరించలేక గడ్డిమందు తాగారు. చికిత్స నిమిత్తం జీజీహెచ్‌లో చేరారు. చికిత్స పొందుతూ 4న మృతిచెందారు. మృతిరాలి భర్త ఫిర్యాదుపై కేసు నమోదు చేశారు.

రాజగోపురంపై మొక్కల తొలగింపు

సర్పవరం జంక్షన్, న్యూస్‌టుడే: కాకినాడ గ్రామీణం సర్పవరంలోని స్వయంభూ రాజ్యలక్ష్మి సమేత భావనారాయణస్వామి ఆలయ రాజగోపురంపై మొలిచిన మొక్కలను శనివారం తొలగించారు. రాజగోపురంపై చాలాకాలంగా మొక్కలు మొలిచి చెట్లుగా మారి గోపురం దెబ్బతినే పరిస్థితుల ఏర్పడ్డాయి. భక్తులు ఆవేదన వ్యక్తం చేయడంతో ఆలయ ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఏఎం గ్రీన్‌కో కంపెనీ సహకారంతో ఏర్పాటు చేసిన భారీ క్రేన్‌తో మొక్కలు తొలగించి, సిమెంటు పనులు చేయించారు.

ఎంపీడీవోలు బాధ్యతల స్వీకరణ

గొల్లప్రోలు, కరవ, కాజులూరు, సామర్లకోట గ్రామీణం, పెద్దాపురం: గొల్లప్రోలు ఎంపీడీవోగా కె.స్వప్న శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన డీఎస్ఎల్ శర్మ ఐ.పోలవరం ఎంపీడీవోగా బదిలీ అయ్యారు. కాకినాడ గ్రామీణ మండల ఎంపీడీవోగా పనిచేసిన స్వప్న గొల్లప్రోలుకు బదిలీపై వచ్చారు. కరప ఎంపీడీవోగా అనుపమ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన కొంకి అప్పారావు ఇటీవల బదిలీపై వెళ్లడంతో తాళ్లరేవు ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న అనుపమను కరప ఎంపీడీవోగా బదిలీ చేశారు. ముమ్మిడివరం ఎంపీడీవోగా పనిచేసిన జె.రాంబాబు బదిలీపై కాజులూరు వచ్చి శనివారం బాధ్యతలు స్వీకరించారు. సామర్లకోట ఎంపీడీవోగా హిమమహేశ్వరి శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈమె ఇక్కడే ఈవోపీఆర్డీగా పనిచేశారు. ఇప్పటివరకు ఎంపీడీవోగా పనిచేసిన శ్రీలలిత పెద్దాపురం ఎంపీడీవోగా బదిలీపై వెళ్లారు. పెద్దాపురం ఎంపీడీవోగా శ్రీలలిత శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు పనిచేసిన బత్తిన అశోక్‌కుమార్ కోరుకొండకు బదిలీపై వెళ్లారు.

తుని

•తుని •ప్రత్తిపాడు •జగ్గంపేట

జాతీయస్థాయి త్రైక్వాండో పోటీలకు లోకేశ్

గండేపల్లి, న్యూస్‌టుడే: సూరంపాలెం ఆదిత్య కళాశాల ఆఫ్ ఇంజినీరింగ్ కు చెందిన విద్యార్థి లోకేశ్ జాతీయస్థాయి త్రైక్వాండో పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ రమేష్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ..మెకానికల్ విభాగానికి చెందిన లోకేశ్ 40వ జాతీయ సీనియర్ త్రైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యారు. లోకేశ్‌ను పలువురు అభినందించారు.

నెహ్రూ ఫౌండేషన్ నూతన కార్యాలయం ఏర్పాటు

జగ్గంపేట: నెహ్రూ ఫౌండేషన్ నూతన కార్యాలయాన్ని జగ్గంపేటలో శనివారం ఫౌండేషన్ ఛైర్మన్ జ్యోతుల మణి ప్రారంభించారు. కార్యాలయం రిబ్బన్‌ను ఆయన సంతకం చేసిన అనంతరం ఆమె మాట్లాడుతూ 'సేవే లక్ష్యంగా' 2016లో ఈ ఫౌండేషన్‌ను స్థాపించామని, ఈ సంస్థ ద్వారా నియోజకవర్గంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు.

అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ

గండేపల్లి: మండలంలోని మల్లేపల్లి గ్రామం కొత్తూరులో నూతనంగా నిర్మించిన ఆలయంలో దుర్గమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని వేదమంత్రోచ్ఛరణలతో శనివారం నిర్వహించారు. అర్చకులు చింతా అరుణకుమార్ శర్మ ఆధ్వర్యంలో దివ్య ప్రతిష్ఠ మహాకుంభ, కష్టాధి బలిహరణ, గో దర్శనం, ప్రతిష్ఠా పూర్ణాహుతి, ప్రసాద వితరణ కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్, కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.


నూతన ఆలయంలో తుమ్మలపల్లి రమేష్, భక్తులు

మేమున్నాం.. మీకు తోడుగా

మంచినీటి ట్యాంకువద్ద శుభ్రత చర్యలు

స్పందనకు వందనం

జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని రాజుపాలెం బీసీ కాలనీలో మంచినీటి ట్యాంకు చుట్టూ అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. నీళ్లు పట్టుకునేందుకు కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను పంచాయతీ కార్యదర్శి ఎం.వి.మూర్తికి వివరించగా ట్యాంకువద్ద శుభ్రత చర్యలు చేపట్టారు.

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: తుని: 9100020946, ప్రత్తిపాడు: 98669 62946 జగ్గంపేట: 80086 22066

పచ్చని కూడలి.. చల్లని వాకిలి

ఆదివారం ప్రత్యేకం

న్యూస్‌టుడే-ప్రత్తిపాడు

గ్రామాల అందం కూడళ్లలోనే ఉంటుంది. పచ్చని చెట్టు, చుట్టూ అరుగులు నలుగురు కూర్చుని ఇదే పల్లెదనానికి చిరునామా! చెట్లు, చెరువులు తగ్గిపోతున్నా.. దుకాణాల సముదాయాలు కూడళ్లలో విస్తరిస్తున్నా.. నియోజకవర్గంలోని కొన్ని పల్లెలు పచ్చని కూడళ్లను పోషించుకుంటున్నాయి. ఈ చిత్రం మండలంలోని శరభవరం గ్రామం లోనిది. మూడు రోడ్ల కూడలిలో తరాల నాటి తరువుల చుట్టూ పక్కా, లోగిళ్లు కట్టి గ్రామస్థులు చల్లగా కాలక్షేపం చేస్తున్నారు. వారపు సంత ఇక్కడే నిర్వహిస్తారు. ఈ చల్లని వాకిలో ముచ్చట్లు రోజూ కనిపిస్తాయి. వేసవిలో ఈ చెట్టు లోగిలి కింద సేద తీరేవారి అధికం. ఊరికి అందం.. కూడలికి చల్లదనంగా నిలిచే ఇలాంటి దృశ్యాలు వాకపల్లి, వెంకటనగరం, ఉత్తరంలో జగన్నాధపురం, తోటపల్లి, కొత్తూరు, ధర్మవరం ప్రత్తిపాడు తదితర గ్రామాల్లో ఇప్పటికీ ఉన్నాయి. పచ్చదనం చెట్లు కూడలిలోనే సమావేశాలు నిర్వహిస్తున్నారు. అభివృద్ధి పేరుతో వీటి జోలికి వెళ్లకుండా ఉండటమే ఊరుకు మేలు!


శరభవరం కూడలిలో చెట్టు చుట్టూ లోగిలి


వంతాడలో చెట్టు..ఎన్నింటికో వేదిక

సమస్యల పరిష్కారానికి కృషి

ఏలేశ్వరం, న్యూస్‌టుడే: ఏలేశ్వరంలోని 5, 6 వార్డులను శనివారం ఉదయం కమిషనర్ ఎం. సత్యనారాయణ, ఏఈ అనూష లక్ష్మి తదితరుల బృందం సందర్శించింది. వార్డుల్లో వీధి దీపాల్లో కొన్ని సక్రమంగా వెలగడం లేదని, కప్పల చెరువు వద్ద చెత్తను తొలగించడం లేదని స్థానికులు పేర్కొన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకునేందుకే వచ్చామని, తప్పకుండా పరిష్కరిస్తామని కమిషనర్ చెప్పారు. కౌన్సిలర్లు పెంద్ర శ్రీను, కోనాల వెంకటరమణ పాల్గొన్నారు.


వార్డుల్లో పర్యటించిన కమిషనర్, అధికారులు

చెరువునీటిపై పచ్చని పరదా

పచ్చని పరదాగా కనిపిస్తున్న ఈ ప్రాంతం చెరువునీట గర్భం. మండలంలోని లోవకొత్తూరు సమీపంలోని సాగునీటి చెరువులో ప్లాస్టిక్, ఇతర కాలుష్యభరిత వ్యర్థాలతో నిండిపోవడం చెరువునీటి పైభాగం మొత్తం కాలుష్యం బారిన పడి ఇలా పచ్చని పరదాగా మారింది. దీంతో చెరువు గర్భంగా మొత్తం గ్రీన్‌మెట్‌గా మారి కనిపిస్తుండటంతో అటుగా వెళ్తున్నవారు ఆసక్తిగా తిలకిస్తున్నారు. - న్యూస్‌టుడే, తుని గ్రామీణం


పచ్చని పరదాగా మారిన లోవకొత్తూరు చెరువునీటి గర్భం

యాజమాన్య వైఖరిని ప్రతిఘటిద్దాం

ఏలేశ్వరం, న్యూస్‌టుడే : ఆం.ప్ర. ప్రజా రవాణా శాఖ ఇచ్చిన 1/19 సర్క్యులర్‌ని తుంగలో తొక్కి ఏలేశ్వరం ఆర్టీసీ డిపో మేనేజర్ తుంగలో తొక్కి కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని యునైటెడ్ వర్కర్స్ యూనియన్ కేంద్ర కమిటీ కార్యదర్శి కేవీఎస్‌పీ రావు ధ్వజమెత్తారు. స్థానిక డిపోలో పనిచేస్తున్న కండక్టర్ శ్రీనివాసరావుని వెంటనే విధుల్లో తీసుకోవాలని కోరుతూ ఐకాస ప్రారంభించిన నిరసన ఐదో రోజు శనివారం కొనసాగింది. డీఎం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. దీక్షల్లో జి.రమేష్, ఎస్ సీహెచ్ శేఖర్, ఏవీబీ రావు పాల్గొన్నారు. మధ్యాహ్న విరామ సమయంలో జరిగిన ధర్నాలో ఎంప్లాయీస్ యూనియన్, ఎన్ఎంయూ, యుడబ్ల్యుయూ ఐకాస నాయకులు యూబీం కుమార్, నానిబాబు, కె.త్రిమూర్తులు, కేఎస్‌కే రావు, మాణిక్యం, చలం, కొండ, అప్పలరాజు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని రామవరం ఎన్‌హెచ్‌పై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతిచెందారు. పోలీసుల వివరాల ప్రకారం.. తొండంగి మండలం సీతారాంపురానికి చెందిన సువర్ణం దుర్గాభవాని(59) కిర్లంపూడిలోని బంధువుల ఇంటికి వచ్చి అక్కడి నుంచి మరికొందరితో రాజమహేంద్రవరం కళ్ల చికిత్సకోసం ఆటోలో బయలుదేరారు. రామవరం భారత్‌పెట్రోల్ బంకు వద్ద ఎదురుగా వస్తున్న మోటారుసైకిల్‌ను తప్పించబోయి ఆటో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో దుర్గాభవానికి తీవ్రగాయాలు కావడంతో జగ్గంపేట సీహెచ్‌సీ, మెరుగైన చికిత్సకోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆమె అక్కడ మృతి చెందారు. ఘటనపై ఏఎస్సై నూకరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అక్రమ మద్యం విక్రయాలపై దాడి

కిర్లంపూడి, న్యూస్‌టుడే: అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించారు. ఎస్సై జి.సతీష్ వివరాల ప్రకారం.. గెద్దనాపల్లిలోని ప్రధాన కూడలి వద్ద అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారు. శనివారం సిబ్బందితో ఎస్సై తనిఖీలు నిర్వహించగా 20 మద్యం సీసాలు లభ్యమయ్యాయి. వాటిని స్వాధీనం చేసుకోవడంతో పాటు నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరచనున్నట్లు ఎస్సై తెలిపారు.

సారా విక్రయిస్తున్న మహిళ అరెస్టు


ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: మండలంలోని ఒమ్మంగి గ్రామంలో ఎక్సైజ్ అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. సారా విక్రయిస్తున్న నార్లంక వరలక్ష్మిని అరెస్టు చేసి 4 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ శివప్రసాద్ తెలిపారు. నిందితురాలికి కోర్టు రిమాండ్ విధించింది. సారా విక్రయాలు, తయారీపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బెల్లం అమ్మకాలపైనా నిరంతరం నిఘా ఉంచామన్నారు.

పాహిమాం దేవీ...రక్షమాం

న్యూస్‌టుడే బృందం: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అన్నవరం సత్యదేవుని క్షేత్ర రక్షకులుగా కొలిచే వనదుర్గ అమ్మవారు భక్తులకు అన్నపూర్ణాదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ● తుని మండలం కుమ్మరిలోవ తపోవనం ఆశ్రమంలో ఆశ్రమ పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతి స్వామీజీ అమ్మవారికి పాదపూజ, పంచామృతాభిషేక పూజలు చేశారు. కాకరాపల్లి గ్రామంలో అమ్మవారిని శాకాంబరిదేవి రూపంలో అలంకరించారు. ● రౌతులపూడి దుర్గాదేవి అమ్మవారిని మిఠాయిలతో అలంకరించారు. రౌతులపూడి, పి. చామవరం, ఎన్.ఎన్.పట్నంలోని అమ్మవార్లు భక్తులకు అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. ● లోవ తలుపులమ్మ అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ● తుని పట్టణం అమ్మాజీపేటలోని మండపంలో అమ్మవారు అన్నపూర్ణగా, బెల్లపువీధిలోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మ, తొండంగి దుర్గామాత గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ● ఏలేశ్వరం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపాన ఉన్న దేవీమాత ఆలయంలో వీహెచ్‌పీ అనుబంధ దుర్గావాహిని, మాతృశక్తి మహిళలు పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మకు చీర, సారె అందజేశారు. ● శంఖవరం మండలం సీతంపేటలోని దుర్గామీనాక్షి అమ్మవారు భక్తులకు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ● ఆంధ్రాశబరిమలై అయ్యప్పస్వామి ఆలయానికి శనివారం భవాని మాలధారులు పెద్ద ఎత్తున చేరుకుని స్వామిని దర్శించుకున్నారు.● ప్రత్తిపాడు రాచపల్లిలోని అరుణాచలేశ్వరస్వామి క్షేత్రంలో అపీత కుచాంబ అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భవానీ భక్తుల పడిపూజలు జరిగాయి. శివాలయం వద్ద భక్తులు అగ్నిగుండంలో నడిచారు. ● జగ్గంపేట దేవీ సెంటర్‌లోని దుర్గమ్మ అమ్మవారు గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. గండేపల్లి ఎన్‌హెచ్ పక్కన ఉన్న దుర్గమ్మ అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.● జగపతినగరంలోని అభయదుర్గాదేవి అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.


రౌతులపూడిలో స్వీట్లతో అమ్మవారి అలంకరణ


అన్నవరం: ప్రత్యేక అలంకరణలో వనదుర్గ అమ్మవారు


కోటనందూరు కాకరాపల్లిలో శాకాంబరిదేవిగా ..


తుని బెల్లపువీధిలో గాయత్రీదేవిగా ..


జగ్గంపేటలో అమ్మవారు


జగపతినగరంలో అన్నపూర్ణాదేవిగా అభయదుర్గాదేవి

త్వరలో స్వగృహ ప్రవేశాలు

నిర్మాణాల పూర్తికి చర్యలు

న్యూస్‌టుడే - తుని, తుని పట్టణం

పట్టణంలోని పేద, మధ్యతరగతి వారికి రాజుపేట ప్రాంతంలో భూసేకరణ చేసి గత ప్రభుత్వంలో 4,770 మందికి పట్టాలిచ్చారు. అయితే అప్పటి వైకాపా ప్రభుత్వం రుణ మంజూరులో జాప్యం, మౌలిక వసతుల కల్పనలో తాత్సారం, పెరిగిన సామగ్రి ధరలతో అనేక మంది ఇంటి నిర్మాణానికి సుముఖత చూపలేదు. ఇళ్ల స్థలాల మంజూరు, పట్టాలు చేతికివ్వడానికి కూడా గతంలో అనేక మంది వైకాపా కౌన్సిల్ సభ్యులు, దళారులు, సచివాలయ సిబ్బంది చేతివాటం చూపడంతో లబ్ధిదారుల నుంచి డబ్బులు గుంజారు. దీంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందాన ఉన్నాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గృహ నిర్మాణం వేగవంతం చేసేందుకు చర్యలు చేపట్టింది.

రాజుపేటలో లబ్ధిదారులకు కేటాయించిన గృహాల పరిస్థితి ఇదీ...

ఇళ్ల స్థలాలు	4,770
రుణం మంజూరైనవి	4,525
ప్రారంభం కానివి	2,413
పూర్తి అయినవి	199
నిర్మాణంలో ఉన్నవి	1,913

'మన ఇల్లు - మన గౌరవం'

'మన ఇల్లు - మన గౌరవం' పేరుతో ప్రభుత్వ ప్రోత్సాహంతో మళ్లీ లబ్ధిదారులు ఉత్సాహంగా ఇంటి నిర్మాణాలు ప్రారంభిస్తున్నారు. కార్మికులు, ఇసుక తదితర సామగ్రి అందుబాటులో ఉండటంతో ఇళ్ల నిర్మాణం ప్రారంభమైంది. ప్రభుత్వం ఒక్కో ఇంటి నిర్మాణానికి విడతల వారీగా రూ.1.80 లక్షలు సహాయం అందిస్తుండగా, పొదుపు సంఘాల మహిళలకు అదనంగా రూ.50 వేల వరకూ వాయిదాల పద్ధతిలో తిరిగి చెల్లించేలా రుణం ఇస్తున్నారు.

క్షేత్రస్థాయిలోని సమస్యలివీ..

లబ్ధిదారులకు ఇచ్చిన ఇళ్ల స్థలాల వద్ద రోడ్లు, కాలువలు లేవు. ఇక ట్రాక్టర్లు, టిప్పర్లు, ఆటోలు వంటివి కూడా వెళ్లే పరిస్థితి లేదు. దీంతో లబ్ధిదారులు సామగ్రి తరలించుకోవడం ఇబ్బందిగా మారింది. బోర్లు వేయించుకోవడానికి పూర్తిస్థాయిలో విద్యుత్తు స్తంభాలు, కనెక్షన్లు లేవు.


తుని మండలం రాజుపేటలో నిర్మాణంలో ఉన్న గృహాలు

కొందరు లబ్ధిదారుల ఇసుక, ఇనుము వంటి సామగ్రి తోపాటు బోర్లు కూడా చోరీ అవుతుండటంతో గగ్గోలు పెడుతున్నారు. తుప్పలు బాగా పెరిగాయి. కొన్నిచోట్ల సరిహద్దు రాళ్లు, ప్లాట్ నెంబర్లు కూడా సరిగాలేక తమ స్థలాలు గుర్తించడానికి లబ్ధిదారులు అవస్థలు పడాల్సి వస్తోంది. సమస్యలను పరిష్కరించాలని లబ్ధిదారులు అధికారులను కోరుతున్నారు.

గడువులోగా పూర్తి చేసేలా చర్యలు

లబ్ధిదారుల్లో అవగాహన పెంచి ప్రభుత్వం నిర్దేశించిన విధంగా 2025 మార్చి నాటికి అన్ని ఇళ్లు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. లబ్ధిదారులకు వసతులు కల్పించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ఇంటి నిర్మాణం త్వరగా చేపట్టాలని లబ్ధిదారులకు సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నాం.

- శ్రీనివాసరావు, డీఈ, గృహనిర్మాణశాఖ, తుని

హక్కులపై అవగాహన పెంచుకోవాలి

ఏలేశ్వరం, న్యూస్‌టుడే: మహిళలు తమకున్న హక్కులపై పూర్తి అవగాహన పెంచుకోవాలని ప్రత్తిపాడు కోర్టు ఇన్‌ఛార్జి జడ్జి బుల్లెమ్మ అన్నారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, మహిళా కమిషన్ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని లింగంపర్తిలో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఆమె మాట్లాడుతూ.. మహిళల రక్షణకు ఉన్న చట్టాలు, వినియోగించుకునే విధానాలపై వివరించారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి రాజ్యాంగం పలు అవకాశాలు కల్పించిందన్నారు. సుప్రీంకోర్టు, జిల్లా జడ్జి ఆదేశాల మేరకు గ్రామగ్రామాన చైతన్య సదస్సులు ఏర్పాటుచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచి వై.చంద్రలేఖ, న్యాయవాదులు బుగత శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి జడ్జి బుల్లెమ్మ

ఎంపీడీవోల బాధ్యతల స్వీకారం


బి.రాజేశ్వరరావు తొండంగి


హరికృష్ణ కిర్లంపూడి


నాతి బుజ్జి గండేపల్లి


ఏ.వి.ఎస్.చంద్రశేఖర్ జగ్గంపేట


ఎస్.ఎస్.శర్మకు శుభాకాంక్షలు తెలుపుతున్న సిబ్బంది


రౌతులపూడి ఎంపీడీవో శివరామకృష్ణయ్య శుభాకాంక్షలు తెలుపుతున్న సిబ్బంది

న్యూస్‌టుడే బృందం: పలు మండలాల్లో మండలపరిషత్ అభివృద్ధి అధికారులు శనివారం బాధ్యతలు స్వీకరించారు. శంఖవరం మండలానికి ఎస్.ఎస్.శర్మ, రౌతులపూడి మండలానికి జి.శివ రామకృష్ణయ్య, గండేపల్లి మండలానికి నాతి బుజ్జి, తొండంగి మండలానికి బడే రాజేశ్వరరావు, జగ్గంపేట మండలానికి ఏవీఎస్ చంద్రశేఖర్, కిర్లంపూడి ఎంపీడీవోగా సి.హరికృష్ణ విధుల్లో చేరారు. కూటమి ప్రభుత్వం చేపట్టే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో ప్రజలకు చేరువ చేసేందుకు కృషి చేస్తామన్నారు. ప్రజాప్రతినిధులు, కార్యాలయ అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి వారికి శుభాకాంక్షలు తెలిపారు. ✦ కత్తిపూడి మేజర్ పంచాయతీ కార్యదర్శిగా భవానీశంకర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు.

వన్యప్రాణుల సంరక్షణతో పర్యావరణ పరిరక్షణ

ప్రత్తిపాడు: అడవులను పరిరక్షించడం, వన్యప్రాణులకు హాని కలగకుండా సమష్టి బాధ్యత వహిస్తే పర్యావరణాన్ని పరిరక్షించినట్టేనని ఎమ్మెల్యే సత్యప్రభ అన్నారు. వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా ప్రత్తిపాడు మినర్వా విద్యాసంస్థల్లో అటవీశాఖ ఏలేశ్వరం రేంజి ఆధ్వర్యంలో విద్యార్థులతో అవగాహన సదస్సు జరిగింది. ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. లయన్స్ మాజీ గవర్నర్ మినర్వా రమేష్, మినర్వా విద్యాసంస్థల కరస్పాండెంట్ ఎం.మురళి, ఏలేశ్వరం ఎఫ్ఆర్‌వో దుర్గారామ్‌ప్రసాద్, కళాశాల ప్రధానాచార్యుడు జోషి ప్రసంగించారు. విజేతలకు ఎమ్మెల్యే బహుమతులు అందజేశారు. నాయకులు కె.కన్నబాబు, యాళ్ల విశ్వేశ్వరావు, అమరాది వెంకట్రావు, పాల్గొన్నారు.


విజేతలకు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

యర్రవరం.. జోరుగా అరటి విక్రయం

ఏలేశ్వరం, న్యూస్‌టుడే : అరటి మార్కెట్ పేరు చెబితే ముందుగా గుర్తుకు వచ్చేది రావులపాలెం. ఆ తర్వాత స్థానం యర్రవరందే. ఏలేశ్వరం మండలంలోని యర్రవరంలో అరటి మార్కెట్ రాష్ట్రవ్యాప్తంగా వాసికెక్కింది. విశాఖ- విజయవాడ మధ్య నంబరు 16 ఎన్‌హెచ్ చెంతనే ఉన్న యర్రవరం.. వ్యాపారానికి పూర్తిగా అనుకూలం. రోజూ ఇక్కడ నుంచి పెద్ద సంఖ్యలో అరటి గెలలు వివిధ ప్రాంతాలకు ఎగుమతి అవుతుంటాయి.

'మెట్ట' నుంచి ఇక్కడకే గెలలు

మెట్ట ప్రాంతంలోని పెద్దాపురం, పిఠాపురం, ప్రత్తిపాడు, జగ్గంపేట మండలాల్లో సుమారు మూడు వేల ఎకరాల్లో అరటి సాగు చేస్తున్నారు. తమ అరటి పంటను రైతులు యర్రవరం మార్కెట్‌కే తీసుకొస్తారు. వ్యాన్‌లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలపై గెలలను ఇక్కడకు తెచ్చి విక్రయిస్తారు. ఇక్కడ నుంచి ఒడిశా రాష్ట్రానికి ప్రధానంగా ఎగుమతి చేస్తారు. లారీల్లో పచ్చి అరటి గెలలను తరలిస్తారు. యర్రవరం మార్కెట్‌లో అమృతపాణి, దేశవాళీ రకాలు లభిస్తాయి. సీజన్‌ను అనుసరించి ఒక్కో గెల రూ.250 నుంచి రూ.400 వరకు ఉంటుంది. పచ్చ అరటి గెలలను రావులపాలెం నుంచి ఇక్కడకు తెచ్చి యర్రవరంలో విక్రయిస్తున్నారు. పచ్చిగా ఉన్న గెలలను వాహనాల్లో ఇతర ప్రాంతాలకు పంపుతున్నారు. అరటి పండ్లను ప్రధాన రహదారి చెంతనే దుకాణాలను ఏర్పాటుచేసి అమ్మకాలు సాగిస్తారు. ఈ దుకాణాల్లో అత్తలాల లెక్కన, గెలల వంతున విక్రయిస్తుంటారు. యర్రవరం మార్కెట్ ఇటు రైతులకు అమ్మకాలకు వేదికగా ఉంది. ఈ మార్కెట్‌తో ఎందరికో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తోంది.


ఎగుమతికి సిద్ధంగా ఉన్న అరటి గెలలు

చిత్తడిగా ర.భ.శాఖ రోడ్డు

జగ్గంపేట గ్రామీణ మండలంలోని వెంగాయమ్మపురం శివారులో ర.భ.శాఖ రోడ్డుపై నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. గ్రామంలో కొళాయిల నీరు, ఇళ్లలో వాడకం నీరు రోడ్డు మీదుగా పారుతుండడంతో ఈ ప్రాంతం చిత్తడిగా మారింది. వర్షం వచ్చినప్పుడు రోజుల తరబడి నీరు నిలిచిపోతోందని వాహనదారులు చెబుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ వ్యవస్థ, కాలువలు లేకపోవడమే ఇందుకు కారణంగా కనిపిస్తోంది. సంబంధిత అధికారులు స్పందించి వృథానీరు రోడ్డుపైకి రాకుండా, నిలిచిపోయిన నీటిని తొలగించాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు. - న్యూస్‌టుడే, జగ్గంపేట గ్రామీణం



ఎక్కడి చెత్త అక్కడే..!

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమం నిర్వహణ తూతూమంత్రంగా సాగుతుంది. గ్రామాల్లో సేకరించిన చెత్తను గ్రామ ముఖద్వారాల వద్ద వేసి మంట పెట్టడంతో దుర్వాసన వ్యాప్తి చెందడంతోపాటు పొగతో కాలుష్యం పెరుగుతుంది. ప్రధానంగా గ్రామాల్లో సేకరించిన చెత్తను సమీపంలోని సంపద కేంద్రాలకు తరలించాల్సి ఉండగా సిబ్బంది కొరత, చెత్తను తరలించే ట్రైసైకిళ్లు పాడైపోయి మూలకు చేరడంతో ఇలా గ్రామ ప్రధాన రహదారుల పక్క పడేసి మంటపెడుతున్నారు. కనీసం రెండు, మూడు గ్రామాలకు చెత్తను వేసేందుకు కనీసం ఒక్క కంపోస్టుయార్డు లేకపోవడం గమనార్హం. దీంతో ఎక్కడి చెత్తకు అక్కడే సిబ్బంది మంటపెట్టి వెళుతున్నారు. ఒక పక్క అధికారులు ముమ్మరంగా స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని చేపడుతున్నా వాటి లక్ష్యం మాత్రం ఇలా నీరుగారిపోతుంది. - న్యూస్‌టుడే, తుని గ్రామీణం


రేఖవానిపాలెంలో పాడైన చెత్తసేకరణ రిక్షా

మొరాయించిన బస్సు.. ప్రయాణికుల పాట్లు


ప్రత్తిపాడు- కిర్లంపూడి మధ్య మరమ్మతులకు గురైన బస్సు

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: కాకినాడ వెళ్లే ఆర్టీసీ బస్సు ప్రత్తిపాడు విద్యుత్తు స్టేషన్ దాటాక మరమ్మతులకు గురైంది. బస్సులోని 25 మందికి పైగా ప్రయాణికులు ప్రత్యామ్నాయం కోసం నిరీక్షించాల్సి వచ్చింది. ప్రత్తిపాడు- కిర్లంపూడి మధ్య సింహాద్రిపురం కూడలికి సమీపంలో బస్సు నిలిచిపోవడంతో అందులోని ప్రయాణికులు ప్రత్యామ్నాయ రవాణా కోసం ఇబ్బంది పడ్డారు. మరమ్మతులు చేసి బస్సు కదిలేటప్పటికి గంటపైనే పట్టింది.